ఉష్ణోగ్రత (అంచనా)

25-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	41	27
తెనాలి	39	27
నరసరావుపేట	41	25
బాపట్ల	37	28
రెంటచింతల	42	26



మోదీ పర్యటనతో.. పోలీసుల అలర్ట్

- కొత్త వ్యక్తుల కదలికలపై కన్ను
- ఆరు వేల మందితో భద్రతా చర్యలు
- రంగంలోకి కేంద్ర నిఘా, హోంశాఖ వర్గాలు
- హోటళ్లు, లాడ్జీలు, అతిథి గృహాలపై నిఘా.. తనిఖీలు
- కశ్మీర్‌లో ఉగ్రవాదుల ఘాతుకంతో మరింత అప్రమత్తం

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమరావతి పర్యటన వచ్చే శుక్రవారం సమీపిస్తోంది. పోలీసుశాఖ అప్రమత్తమైంది. కొత్త వ్యక్తుల కదలికలపై కన్నేయడంతో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా హోటళ్లు, లాడ్జీలు, అతిథి గృహాలపై నిఘాతో పాటు తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నారు. భారీగా జనం సమీకరణ నేపథ్యంలో ఆరు వేల మందితో పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర నిఘా, హోంశాఖ, గూడాచార వర్గాలు కూడా రంగంలోకి దిగాయి. సభ జరిగే ప్రాంతంపై పోలీసు వర్గాలు డేగ కన్ను వేసి పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాయి. ఇప్పటికే కేంద్ర బలగాలు ప్రధాని సభ జరిగే ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకున్నాయి. ప్రధాని సభ, రోడ్ షో మార్గాలన్నింటిపైన నిఘా వర్గాలు కన్నేశాయి. ప్రధాని కార్యాలయంతో పాటు కేంద్ర హోం శాఖలోని ఉన్నతాధికారులు కూడా ఎప్పటికప్పుడు జిల్లాలోని పరిస్థితులను ఆరా తీస్తూ పోలీస్ ఉన్నతాధికారులకు సూచనలు, ఆదేశాలు జారీ చేస్తున్నారు.

గుంటూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలో మే 2న జరగనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభ నేపథ్యంలో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. కానిస్టేబుల్ స్థాయి నుంచి కేంద్ర హోం శాఖ వరకు అన్ని విభాగాల అధికారులు ఎవరిస్థాయిలో వారు రంగంలోకి దిగా రు. జమ్మూ కశ్మీర్లో జరిగిన ఉగ్ర దాడి నేపథ్యంలో కేంద్ర నిఘా వర్గాలతో పాటు కౌంటర్ ఇంటెలిజెన్స్ వర్గాలు పూర్తిగా అప్రమత్తమయ్యాయి. రాజధాని ప్రాంతంతో పాటు జిల్లా కేంద్రమైన గుంటూరు పరిధిలోని హోటళ్లు, లాడ్జీలు, అతిథి గృహాల్లో పోలీ సులు ఇప్పటికే ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. రైల్వేస్టేషన్, బస్టాండ్‌లపై కూడా నిఘా వేశారు. అనుమానాస్పద వ్యక్తులు, కొత్త వ్యక్తుల కదలికలను నిశితంగా గమనిస్తున్నారు. ఇప్పటికే లాడ్జీలు, హోటళ్ల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసిన పోలీసులు కొత్త వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆయా వ్యక్తులకు సంబంధించి ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డులు తీసుకుని గదులు కేటాయించాలని ఆదేశించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు కూడా చేపట్టారు. ఇంతకు ముందు మోదీ సభకు ఐదు వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేయాలని నిర్ణయించి ప్రణాళిక రూపొందించారు. అయితే పహల్గామ్ ఉగ్రదాడితో అదనపు బలగాలను నియమించాలని నిర్ణయం తీసుకున్నారు. తాజాగా మరో వెయ్యి మంది సిబ్బందిని అదనంగా నియమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం ఆరు వేల మంది పోలీస్ బలగాలతో పీఎం సభకు ఆరంచెల భద్రత ఏర్పాటు చేయనున్నారు. చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద గతంలో జరిగిన మోదీ సభలో గందరగోళం నెలకొన్న నేపథ్యంలో ఈ సారి అలాంటి ఘటనలకు ఆస్కారం లేకుండా పోలీసులు ఇప్పటి నుంచే పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

రోడ్ షో మార్గంలో డాగ్, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

మోదీ రోడ్‌షో మార్గంలో పోలీస్ బలగాలు నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నాయి. డాగ్, బాంబ్ స్క్వాడ్ బృందాలు కల్వర్ట్‌లు, చప్టాలు, రోడ్‌మార్జిన్లలో, పొలాలు, అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. మరోవైపు రాజధాని ప్రాంతంపై పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. డ్రోన్ కెమేరాలతో ఆయా ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గమనిస్తున్నారు. సీసీ కెమేరాల ద్వారా ఆ ప్రాంతంలోని పరిస్థితులను గమనిస్తున్నారు. పార్కింగ్ ప్రదేశాలు, సభా వేదిక వద్ద ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, పార్కింగ్ ప్రదేశాలపై కూడా నిఘా కొనసాగిస్తున్నారు.


వేదిక ప్రదేశంలో తనిఖీలు చేస్తున్న డాగ్ స్క్వాడ్ టీం

రాజధానిలోనే ఉన్నతాధికారుల మకాం

ప్రధాని పర్యటన నేపథ్యంలో అవాంచనీయ ఘట నలకు ఆస్కారం లేకుండా పోలీస్ ఉన్నతాధికారులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పోలీస్ ఉన్నతాధికారులు రాజధాని ప్రాం తంలోనే మకాం వేసి రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు. ఆయా శాఖల అధికారులు, సిబ్బం దిని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నారు.



సాగర్ వెలవెల

- జలాశయంలో 139.61 టీఎంసీలు
- డెడ్‌స్టోరేజి పోగా మిగులు 27.43 టీఎంసీలే
- వరద వచ్చే వరకు పొదుపుగా వాడుకోవాల్సిందే
- వచ్చే నెలలో తాగు అవసరాలకు నీటి విడుదలకు అవకాశం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) నాగార్జున సాగర్ జలాశయంలో నీరు నిండుకుంటోంది. మండుతున్న ఎండలతో జలాశయంలో రోజురోజుకు నీరు తరిగిపోతోంది. వరదలు వచ్చే వరకు ఉన్న జలాశయంలోని నీటిని పొదుపుగా వాడుకోవాలి. 312.05 టీఎంసీలు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం కాగా ప్రస్తుతం 139.61 టీఎంసీలు మాత్రమే జలాశయంలో ఉన్నాయి. డ్యామ్‌లో 27.43 టీఎంసీల నీరు వినియోగానికి అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది జూలైలోనే సాగర్‌కు వరద వచ్చింది. ఈ ఏడాది కూడా వర్షాలు పుష్కలంగా కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో త్వరతగతిన సాగర్‌కు వరదలు రావచ్చని అంచనా వేస్తున్నారు. మే నెల మూడో వారంలో కుడి కాల్వ పరిధిలో తాగు అవసరాలకు నీటిని విడుదల చేసే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. 5 నుంచి 8 టీఎంసీల వరకు తాగునీటి అవసరాలకు సరఫరా చేయనున్నారు.

వృథాతోనే ఇప్పుడీ కష్టాలు

సాగర్ జలాశయంలో గత నవంబరులో పూర్తిస్థాయి నీటి మట్టం ఉంది. దాదాపు 310 టీఎంసీల నీటి నిల్వ ఉంది. అయితే ఇరు రాష్ట్రాలు సాగర్‌లో అవసరం ఉన్నా లేకున్నా పెద్దఎత్తున కాల్వలకు నీటిని విడుదల చేసి వృథా చేశాయి. డిసెంబరు 1న కూడా 306 టీఎంసీల నీరు ఉంది. ఈ నెల 9న సాగర్ కుడి కాల్వకు నీటి విడుదలను నిలిపేశారు. అప్పటికి జలాశయంలో 142.08 టీఎంసీల నీటి నిల్వ ఉంది. నాలుగు నెలల్లో 164 టీఎంసీల నీటిని ఇరు రాష్ట్రాలు పోటీ పడి మరీ వాడుకున్నాయి. దీంతో జలాశయంలో నీటి నిల్వలు నిండుకున్నాయి. ప్రస్తుతం జలాశయంలో 139.61 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉన్న నీటిని పూర్తిగా వినియోగించుకునే అవకాశం లేదు. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 514.6 అడుగులు ఉంది.

ఆవిరి నష్టం.. 20 శాతం

సాగర్ జలాశయం డెడ్ స్టోరేజి 498 అడుగులు. అంటే 112.18 టీఎంసీల నిల్వ ఉన్నట్లు. అయితే 27.43 టీఎంసీల నీటిని మాత్రమే వాడుకునే అవకాశం ఉన్నట్లు జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. సాగర్‌కు వరదలు వచ్చే వరకు ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు పొదుపుగా వినియోగించుకోవాలి. ఎండకు జలాశయంలో ఆవిరి నష్టం దాదాపు 20 శాతం వరకు ఉంటుందని అంచనా. అంటే ఉన్న నీటిలో 4 నుంచి 5 టీఎంసీల వరకు ఆవిరి అవుతుంది. నదీ పరివాహక ప్రాంతంలో సకాలంలో వర్షాలు కురిసి వరదలు వస్తేనే సాగర్ జలకళ సంతరించుకుంటుంది. సకాలంలో వర్షాలు కురవకపోతే నీటికి గడ్డుకాలమే.

టుబాకో బోర్డు చట్టంలో సవరణలు
- గజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్ర వాణిజ్య శాఖ


8

ఆనందం అధికం
❖ ఆలయాల్లో నాయీ బ్రాహ్మణులకు వేతనాల పెంపు
❖ ఏకంగా రూ.25 వేలు చేసిన ప్రభుత్వం

ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లు 90 శాతం పూర్తి : మంత్రి నారాయణ

6

నా రేటే.. సపరేటు



- విజిలెన్స్‌లో వితండ వాదన
- ఎవర్నీ వదిలేది లేదన్న రీతిలో దోపిడీ
- అడిగినంత ఇవ్వకుంటే రూ.90 లక్షలు ఫైన్ వేస్తామని మైనింగ్ వ్యాపారికి హెచ్చరిక

గుంటూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు విజిలెన్స్, ఎన్‌ఫోర్సుమెంట్‌లోని కొందరు అధికారుల తీరు వివాదాస్పద మవుతోంది. ఇచ్చే దాని కన్నా ఎక్కువ కావాలని పట్టు పడుతుండటంతో వివాదం తలెత్తుతుంది. అడిగి నంత ఇవ్వకుంటే ఇబ్బందులు పడతారని హెచ్చ రిస్తూ కొందరు అధికారులు దోపిడీకి తెర తీస్తున్నారు. ఇసుక.. రేషన్ బియ్యం.. ఇలా వ్యాపారం ఏ దైనా తమను కలవాల్సిందే అని తెగేసి చెబుతున్నారు. ఇవన్నీ జిల్లా అధికారికి తెలుసో.. లేదో.. కానీ మొత్తానికి పరిస్థితి మాత్రం చేయి దాటిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విజిలెన్స్‌లోకి వచ్చిన అధికారులు కొందరు కొన్నిరోజులు బాగానే ఉన్నా ఆ తర్వాత వ్యాపారులను పిలిపించి రహస్యంగా మాట్లాడటం మొదలెట్టారు.

రూ.90 లక్షలు.. గుండె గుభేలు

ఆరోపణల నేపథ్యంలో ఈ మధ్య ఓ మైనింగ్ వ్యాపారిని కలిసిన అధికారులు గుండె గుభేలుమనే మాట చెప్పారు. దారికి రాకుంటే రూ.90 లక్షలు ఫైన్ రాస్తామని చెప్పడంతో ఆ వ్యాపారి ఒణికిపోయాడు. చేసేది లేక అడిగినంత ముట్ట జెప్పినట్లు సమాచారం. ఇలాంటి ఉదంతాలు కోకొల్లలుగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఏ పార్టీ అయినా డోంట్‌కేర్

విజిలెన్స్‌లోని ఒకరిద్దరు అధికారులు పార్టీలతో పనిలేకుండా మామూళ్ల కోసం ఆదేశాలు జారీ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో నెలకు రూ.50 వేలు ఇస్తే ఇప్పుడు రూ.లక్ష వరకు ఇవ్వాలని రేట్లు పెంచటం జరిగింది. చేసేది లేక అడిగినంత ఇస్తున్నా ఓ అధికారి సపరేటుగా కలవాలని ఒత్తిడి చేస్తున్నాడని వ్యాపారులు కొందరు ఆరోపిస్తున్నారు. వ్యాపారాలు ఎవరు ఎక్కడ వరకు చేయాలో హద్దులు కూడా ఆయనే నిర్ణయిస్తున్నారని చెబుతున్నారు. కొందరు అధికారుల నుంచి ఫోన్ వస్తుంటేనే గుండెలు ఆగినంత పని అవుతోందని వాపోతున్నారు. పల్నాడు, డెల్టాలోని ఇసుక రేవుల్లో మొదట కొద్దిగా హడావుడి చేశారు. ఆ తర్వాత కథ మొత్తం కంచికి వెళ్లింది.

అప్పుడలా.. ఇప్పుడిలా...

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ కార్యకర్తలపై దురుసుగా ప్రవర్తించిన వారికే విజిలెన్స్‌లో పోస్టులు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. ఓ అధికారి ప్రస్తుత ముఖ్యమంత్రి గురించి బహిరంగంగానే నోరు పారేసుకున్నాడని కొందరు టీడీపీ నేతలు చెబుతున్నారు. ఈ అధికారి వైసీపీ హయాంలో కూడా కీలకమైన పోస్టు లోనే ఉన్నట్లు గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు అదే అధికారి విజిలెన్స్‌లోకి వచ్చారంటున్నారు. మొత్తంమీద కొందరు విజిలెన్స్ అధికారుల వ్యవహార శైలి ఎవర్నీ ఖాతరు చేయని పరిస్థితిలో ఉన్నట్లు బహిర్గతం అవుతుంది.

దూరవిద్యలో.. అరకొరే

- నిరాశాజనకంగా పదిలో ఉత్తీర్ణత
- ఐదో స్థానంలో నిలిచిన పల్నాడు జిల్లా
- తీసికట్టుగా గుంటూరు, బాపట్ల ఫలితాలు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో నాలుగో స్థానంలో నిలిచిన గుంటూరు జిల్లా దూర విద్యలో మాత్రం నిరాశాజనకమైన ఫలితాలు మూటగట్టుకుంది. గుంటూరు జిల్లాతో పాటు బాపట్ల జిల్లాల్లో కూడా నిరాశాజనకమైన ఫలితాలు నమోదయ్యాయి. పల్నాడు జిల్లాలో మాత్రం కొంత మెరుగుగా ఉంది. పదో తరగతి దూర విద్య పరీక్షకు గుంటూరు జిల్లా నుంచి 939 మంది హాజరు కాగా వారిలో 55 మంది మాత్రమే(5.86 శాతం) ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రస్థాయిలో జిల్లా 22వ స్థానంలో నిలిచింది. ఇక పల్నాడు జిల్లా నుంచి 1077 మంది పరీక్షకు హాజరు కాగా వారిలో 567 మంది(52.65 శాతం) ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రస్థాయిలో పల్నాడు జిల్లా ఐదో స్థానం లో నిలిచింది. బాపట్ల జిల్లా నుంచి 749 మంది పరీక్షలకు హాజరుకాగా 179 మంది (23.90 శాతం) మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రస్థాయిలో జిల్లా స్థానం 14గా నమోదైంది.

ఇంటర్ ఫలితాల్లో..

దూరవిద్య ఇంటర్‌కు సంబంధించి గుంటూరు జిల్లా నుంచి 2180 మంది పరీక్షకు హాజరుకాగా వారిలో 1218 మంది(56.51 శాతం) మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రస్థాయిలో జిల్లా ఎనిమిదో స్థానంలో నిలిచింది బాపట్ల జిల్లా నుంచి 1766 మంది పరీక్షలకు హాజరుకాగా 1028(58.21 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రస్థాయిలో జిల్లా ఆరో స్థానంలో నిలిచింది ఇక పల్నాడు జిల్లా నుంచి 1996 మంది పరీక్షకు హాజరుకాగా 1128 మంది(56.21 శాతం) ఉత్తీర్ణుల య్యారు. ఉత్తీర్ణతలో జిల్లాస్థానం ఏడుగా నమోదైంది.



విద్యార్థులు మృతిచెందిన బావి

ప్రాణం తీసిన ఈత సరదా!

- నేల బావిలో దిగి ఇద్దరు విద్యార్థుల మృతి
- మృతుకి కారణం ఈత రాకపోవడమే అంటున్న స్థానికులు
- మాచవరం మండలం కొత్తపాలెంలో విషాద ఛాయలు

ప్రాణం తీసిన ఈత సరదా

నేల బావిలో దిగి ఇద్దరు విద్యార్థుల మృతి



పప్పుల ఏసురాజు(ఫైల్ ఫొటో)
వేమవరపు జశ్వంత్(ఫైల్ ఫొటో)

మాచవరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ఇవ్వడంతో ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు నేల బావిలో మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపాలెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, మాచవరం పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపాలెం గ్రామానికి చెందిన పప్పుల ఏసురాజు(16), వేమవరపు జశ్వంత్(9) వేసవి సెలవులు ఇవ్వడంతో ఉదయం మాచవరం, కొత్తపాలెం గ్రామాల మధ్య ఉన్న హసన్ నేల బావిలో ఈతకు వెళ్లారు. ఇద్దరూ బావిలో దూకగా.. వచ్చీరాని ఈతతో ఊపిరాడక ఇద్దరు విద్యార్థులు బావిలో మునిగి మృతి చెందారు. ఈ సమయంలో ఎవరూ వారిని గమనించలేదు. మధ్యాహ్నం యామర్తి అశోక్ అనే వ్యక్తి ఈత కొట్టేందుకు బావిలో దూకగా అతడి కాళ్లకు వారిద్దరి మృతదేహాలు తగిలాయి. అతను భయపడి ఒక్కసారి పైకి వచ్చి చూడగా బావి ఒడ్డున సైకిల్, దుస్తులు ఉండడం గమనించాడు. దీంతో వెంటనే అశోక్ స్థానికులకు సమాచారం చేరవేశాడు. అప్పటికే ఏసురాజు, జశ్వంత్ తల్లిదండ్రులు ఉదయం వెళ్లిన పిల్లలు ఇంత వరకు తిరిగి రాలేదంటూ గ్రామంలో వెతుకులాడుతున్నారు. బావిలో ఎవరో పిల్లలు చనిపో యారన్న విషయం తెలుసుకున్న తల్లిదండ్రుల హుటాహుటిన బావి వద్దకు వచ్చి ఒడ్డు మీద ఉన్న సైకిల్, దుస్తులను గమనించి అవి తమ పిల్లలవేనని గుర్తించారు. ఈ ఘటనను పోలీసుల దృష్టికి తీసుకు వెళ్లగా.. ఈతగాళ్ల సాయంతో ఇద్దరు విద్యార్థుల మృతదేహాలను బయటకు తీశారు. వెంటనే తల్లిదండ్రులు మృతదేహాలపై పడి బోరున విలపి స్తున్న ఘటన కంటతడి పెట్టించింది. ఏసురాజు ఒక్కగా నొక్క కొడుకు కావడంతో ఆ తల్లిదండ్రులు పడుతున్న బాధ వర్ణనాతీతం. ఏసురాజు ఇటీవల విడుదలైన 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించలేక పోయాడు. జశ్వంత్ 5వ తరగతిలో చేరాల్సి ఉంది. ఇద్దరూ ఎస్సీ విద్యార్థులు కావడంతో ఎస్సీ కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి. దాచేపల్లి సీఐ భాస్కరరావు, ఎస్ఐ పాపారావు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మృతుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. గురజాల ప్రభుత్వ వైద్యాధికారి కొత్తపాలెం గ్రామానికి చేరుకొని మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు.

ఎమ్మెల్యే యరపతినేని దిగ్భ్రాంతి

కొత్తపాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన కొప్పుల ఏసురాజు, వేమవరపు జశ్వంత్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి సంతాపం తెలిపారు. ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం, పార్టీ పరంగా తన వంతు సహాయ సహకాలు అందిస్తానని యరపతినేని బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు.

హత్య కేసులో జీవిత ఖైదు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ వ్యక్తిని నరికి హతమార్చినట్లు నేరం రుజువు కావడంతో నిందితుడు, బాపట్ల జిల్లా బల్లికురవ మండలం వేమవరం గ్రామానికి చెందిన వాడితే నాగేశ్వరరావు నాయక్‌కు జీవిత ఖైదు, రూ.10వేల జరిమానా విధిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయ అధికారి నేతి సత్యశ్రీ గురువారం తీర్పు వెలువరించారు. హతుడు షేక్ ఖాదర్ బాబా(32), నిందితుడు నాగేశ్వరావు నాయక్ ఇద్దరిదీ ఒకే ఊరు. ఖాదర్ బాబా చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామంలో చికెన్ షాపు నిర్వహిస్తూ జీవిస్తుంటాడు. మురికిపూడికి చెందిన ఓ మహిళతో అతను సన్నిహితంగా ఉంటున్నాడు. సదరు మహిళతో నిందితుడు నాగేశ్వరరావునాయక్ కూడా గతంలో సన్నిహితంగా మెలిగాడు. ఖాదర్ బాబాతో పరిచయమైన తర్వాత నాగేశ్వరరావునాయక్‌ను ఆ మహిళ దూరం పెట్టింది. దీంతో ఆగ్రహించిన నాగేశ్వరావు 2019 జూలై 23న రాత్రి చికెన్ షాప్‌లో నిద్రిస్తున్న ఖాదర్ బాబాను కత్తితో మెడపై నరికి హతమార్చాడు. మృతుడి భార్య షేక్ షాహిన పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువుకావడంతో.. కోర్టు నిందితుడికి శిక్ష, జరిమాన విధిస్తూ.. తీర్పునిచ్చింది. ప్రాసిక్యూషన్ ఏపీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి నిర్వహించారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

- అడుగడుగునా బోర్లు - జలాలు లాగేస్తున్న మొక్కజొన్న, జొన్న పైర్లు - సాధారణ మోటార్ల స్థానంలో సబ్ మెర్సిబుల్స్



భూగర్భ జలాలతో మొక్కజొన్న పైరుకు నీరు (ఇన్‌సెట్‌లో) జలాలు అడుగంటడంతో మోటార్లను భూమి లోపలికి ఏర్పాటు చేసిన దృశ్యం

వేమూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగుంటుతున్నాయి. ప్రధానంగా జొన్న, మొక్కజొన్న పైర్లకు ఆరుతడులు పెట్టేందుకు రైతులు పూర్తిగా బోర్లు వేసి వాటి ద్వారా భూగర్భ జలాలను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. వేసవి వచ్చే సరికి భూగర్భ జలాలు అడుగండడం వల్ల సాధారణ మోటార్ల స్థానంలో సబ్ మెర్సిబుల్స్ ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో 60 అడుగుల లోతులో ఉండే నీరు ప్రస్తుతం 100 అడుగుల లోతుకు చేరుకుంది. సాధారణ పంపులు వేసినా ఉపయోగంలేని పరిస్థితి ఏర్పడింది. మోటార్లు లేకుండా మంచినీటిని తోడుకునే పరిస్థితి కనబడటం లేదు. చేతి పంపులు తలను కూడా 10 అడుగుల లోతులో వేయాల్సి వస్తోంది. పంట భూముల్లో మోటార్లను కూడా కొంతమేర గోతులు తీసి వాటిలో మోటార్లను అమరిస్తేనే నీటిని లాగగలుగుతున్నాయి. జొన్న, మొక్కజొన్న పైర్లను నియోజకవర్గ ప్రాంతంలో విస్తృతంగా వేయడం వల్ల ఆ పైర్లకు ఆరుతడులు ఎక్కువగా పెట్టాల్సి రావడం వల్ల భూగర్భ జలాల అడుగంటుతున్నాయి. జొన్న, మొక్కజొన్న పైర్లు జలాలను ఎక్కువగా లాగేస్తాయి. గతంలో ఈ ప్రాంతంలో మినుము, పెసర పైర్లు మాత్రమే రైతులు వేసేవాళ్లు. బంగారు తీగ, ఇతర తెగుళ్ల వల్ల ఆ పైర్లను పూర్తిగా వదిలేశారు. మాగాణి భూములు 72,773 ఎకరాలు సాగులో ఉండగా 44,168 ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న పైర్లు వేశారు. ఈ రెండు పైర్లు నియోజకవర్గంలోని 89 గ్రామాల పరిధిలో రైతులు వేయడం వల్ల ప్రతి గ్రామంలోనూ భూగర్భ జలాలు తగ్గిపోతున్న పరిస్థితులు సంతరించుకున్నాయి. వేసవి ప్రారంభంలోనే మంచినీటి సమస్య ఏర్పడితే మరో పది రోజులు గడిచాక నీటి సమస్య మరింత జఠిలం అవుతుందని గ్రామాల ప్రజలు భావిస్తున్నారు. జొన్న, మొక్కజొన్న పైర్లు వేయడం ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో గ్రామాల్లో మంచినీరు దొరకక పూర్తిగా మంచినీటి పథకాల ద్వారా వచ్చే కుళాయి నీటిపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని కూడా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల్లో అవగాహన కల్పించి జొన్న, మొక్కజొన్న పైర్లతో సమానమైన ఆదాయం లభించే పైర్లు వేసే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు సూచిస్తున్నారు.

ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లు 90 శాతం పూర్తి : మంత్రి నారాయణ



పార్కింగ్ ప్రదేశాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

తుళ్లూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు 90 శాతం పూర్తయినట్టు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. అమరావతిలో మే 2వ తేదీన జరగనున్న ప్రధాని సభ ఏర్పాట్లను గురువారం మంత్రి నారాయణ అధికారులతో కలిసి పరిశీలించారు. రాజధాని అమరావతి నిర్మాణం కోసం 34 వేల ఎకరాలను భూ సమీకరణకు ఇచ్చిన రైతులను ప్రధాని సభ సందర్భంగా గౌరవించే ఏర్పాట్లు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలిచ్చారని మంత్రి వెల్లడించారు. ఇందుకోసం 30 మంది రైతులను ఎంపిక చేసే పనిలో అధికారులు వున్నారని తెలిపారు. సభకు వచ్చే జనం కోసం 11 పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. అయితే, ఆ సంఖ్యను ఇంకా పెంచాలని సీఎం చంద్రబాబు సూచించారని మంత్రి నారాయణ తెలిపారు. ప్రధాని సభకు 5 లక్షలు మంది ప్రజలు వచ్చే అవకాశం ఉండటంతో అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు అమరావతిలో ఉండాలనేది సీఎం సంకల్పం అన్నారు. గన్నవరం ఎయిర్ పోర్టు ఉన్నా, ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు ఉంటే అది అమరావతికే తలమానికమన్నారు. అప్పట్లో హైదరాబాద్‌లో ఒక ఎయిర్ పోర్టు ఉంది. చంద్రబాబు నాయుడు శంషాబాద్ ఎయిర్ పోర్టు నిర్మాణం చేయటంతో హైదరాబాద్ అభివృద్ధి శరవేంగా జరిగిందని మంత్రి వివరించారు. ఉష్ణోగ్రత పెరుగుతుండటంతో ప్రధాని సభకు వచ్చే వారికి చల్లదనం, ఊరటనిచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రధాని రాజధాని అమరావతి పనుల శంకుస్థాన పైలాన్ ఆవిష్కరించేందుకు అధికారులు వేదిక వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మీ, ఎస్పీ సతీష్ కుమార్, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, సభ ఏర్పాట్ల ఇన్‌చార్జి వీరప్యాండన్, సీఆర్డీఏ చీఫ్ ఇంజనీర్ ధనుంజయ ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వలసకూలీ మృతి



బెల్లంకొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై వలస కూలీ మృతిచెందిన ఘటన మండలంలోని వన్నాయపాలెం గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. ఈ ఘటనలో భద్రాచలం జిల్లా కొత్తగూడెం గ్రామానికి చెందిన కేతావత్ రవినాయక్(32) మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు రవినాయక్ గత ఐదు రోజుల నుంచి వన్నాయపాలెంలో నూతన విద్యుత్ లైన్ స్తంభాలను ఏర్పాటు చేసేందుకు వచ్చాడు. కేంద్ర ప్రభుత్వం నూతన్ లైన్‌లను ఏర్పాటులో భాగంగా రవినాయక్ విద్యుత్ స్తంభంపై విద్యుత్ వైరును చుడుతున్నాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన గుర్తుతెలియని వ్యక్తి వీధి లైట్ల మెయిన్‌ను ఆన్ చేయటంతో విద్యుత్ షాక్‌కు గురై స్తంభం పైనుంచి కిందపడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు. గ్రామస్తుల సమాచారం మేరకు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

29 నుంచే యథావిధిగా ఏఎన్‌యూ పీజీ పరీక్షలు

పెదకాకాని, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహించే పీజీ నాలుగవ సెమిస్టర్ పరీక్షలు యథావిధిగా ఈ నెల 29 తేదీ నుంచి జరుగుతాయని విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాద్ గురువారం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ తేదీలలో ఎలాంటి మార్పు లేదని పేర్కొన్నారు. 29 వ తేదీన జరగబోతున్న పరీక్షలకు విద్యార్థులు సంసిద్ధం కావాలని ఆయన సూచించారు. అయితే, ఇటీవల సామాజిక మాధ్యమాలలో, పలు సోషల్ మీడియా వేదికలపై వస్తున్న అసత్య సర్క్యులర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డైమండ్ జూబ్లీ వేడుకలు

లాంఫాం(తాడికొండ) ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డైమండ్ జూబ్లీ వేడుకలు ఈ నెల 29, 30 తేదీలలో నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ శారదా విజయలక్ష్మీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1964 సంవత్సరంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం స్థాపించి 60 సంవత్సరాలు నిండిన సందర్భంగా ఈ వేడుకలను రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డైమండ్ జూబ్లీ వేడుకలకు ముఖ్యఅతిధులుగా గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొంటారని తెలిపారు.

మానవ మేధకు గుర్తింపు..

ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవం

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ఆచార్య కె.రామ్మోహన్‌రావు

పెదకాకాని, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మానవ మేధకు గుర్తింపు ప్రపంచ మేధోసంపత్తి దినోత్సవం అని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఆచార్య కె.రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. గురువారం మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, రాష్ట్ర ప్రభుత్వం ఇన్నోవేషన్ విభాగం, ఉన్నత విద్యా మండలి, ఆచార్య నాగార్జున విద్యాలయం 'రూసా' సంయుక్తంగా ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవం నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రపంచాన్ని అన్ని రంగాల్లో తమ మేధో సంపత్తితో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న భారతీయులు.. స్వదేశంలో ఎంతవరకు తమ మేధస్సును దేశ అభివృద్ధికి ఉపయోగిస్తున్నారని ఎవరికి వారు ప్రశ్నించుకోవాలన్నారు. ప్రజలు, అధ్యాపకులు, విద్యార్థులు తమ మేధస్సుతో దేశాన్ని ప్రగతి పథంలో నడిపించాలని, నూతన ఆవిష్కరణలు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కళాశాలలు, విద్యా కేంద్రాలు, విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. విద్యార్థుల్లోనిఅంతర్గతంగా ఉన్న మంచి ఆలోచనలు, సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలను ప్రోత్సహించాలని అధ్యాపకులకు సూచించారు. ఏప్రిల్ 26 వ తేదీన ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవం సందర్భంగా తమ తమ విద్యా కేంద్రాలలో విద్యార్థుల సృజనాత్మకతను ప్రోత్సహించేలా పలు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనాత్మక దృష్టితో విద్యాభ్యాసం సాగించాలని సూచించారు. ఈ సదస్సుకు ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య కె.రత్న షీలామణి సభాధ్యక్షులుగా, ఆచార్య ఎం.మురళీమోహన్ సమన్వయకర్తగా వ్యవహరించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం పాల్గొన్నారు. ఈ సదస్సుకు కీలక ఉపన్యాసకులుగా నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కు చెందిన డాక్టర్ బీజాయ్ కుమార్ సాహు, ఆర్ట్స్ కామర్స్ లా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్, ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, ఎం.అజిత్, ఆచార్య జి.చెన్నారెడ్డి, ఆచార్య డీపీ హర్షవర్ధన్‌రెడ్డి, ఉన్నత విద్యా మండలి ప్రిన్సిపల్ డాక్టర్ డి.అనిల్‌కుమార్, రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళాశాలల అధ్యాపకులు ఈ సదస్సులో పాల్గొన్నారు. సదస్సులో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు ప్రదానం చేశారు.



ప్రసంగిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఆచార్య కె రామ్మోహనరావు



పోటీల్లో బండలాగుతున్న ఎడ్లు

సబ్ జూనియర్ విజేతగా మద్దిరాల ఎడ్లు

వినుకొండటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదమంచిపాటి వీరాంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఆరు రోజుల నుంచి హోరాహోరీగా సాగుతున్నాయి. బుధవారం రాత్రి జరిగిన సబ్ జూనియర్స్ విభాగం పోటీల్లో ప్రకాశం జిల్లా నాగోలుపాడు మండలం మద్దిరాలకు చెందిన పుచ్చకాయల శేషాద్రిచౌదరి ఎడ్లు 4,788.9 అడుగులు లాగి మొదటి బహుమతి, హైదరబాదుకు చెందిన ప్రగతి రిసార్ట్స్ ప్రీతిక రామకృష్ణ ఎడ్లు 4,775 అడుగులు లాగి ద్వితీయ స్థానం, కృష్ణాజిల్లా పెనమలూరు తాలూకా పెద్ద పులిపాకకు చెందిన గరికపాటి శ్రీధర్‌కు చెందిన ఎడ్లు 4,250 అడుగులు లాగి తృతీయ స్థానం, కృష్ణాజిల్లా మల్లవల్లికి చెందిన అక్కినేని ముకుల్ సత్యచౌదరి ఎడ్లు 3,750అడుగులు లాగి 4వ స్థానం కైవసం చేసుకున్నాయి. పల్నాడు జిల్లా నకరికల్లు మండలం రూపెనగుంట్ల వీఎస్‌పీ హాస్పిటల్‌కు చెందిన ఎడ్లు 3,501 అడుగులు లాగి 5వ స్థానం, కృష్ణాజిల్లా ఆలవారిపాలేనికి చెందిన మేక రామకృష్ణ, బొంతు లోకేష్, బసివిరెడ్డికి చెందిన ఎడ్లు 3,500 అడుగులు లాగి 6వ స్థానం, ప్రకాశం జిల్లా కంభం మండలం లాయర్ కృష్ణకు చెందిన ఎడ్లు 3,314 అడుగులు లాగి 7వ స్థానం, గుంటూరు జిల్లా లింగాయపాలెం ఎల్లం సాంబశివరావు ఎడ్లు 3,283అడుగులు లాగి 8వ స్థానం, కృష్ణా జిల్లా కంకిపాడు మండలం ప్రొద్దుటూరుకు చెందిన కట్టుగోలు రవీంద్రాఎడ్డికి చెందిన ఎడ్లు 3,205 అడుగులు లాగి 9వ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు బోడెపూడి వెంకటేశ్వర్లు, కట్టా కోటయ్య, నలబోతు రామకోటేశ్వరరావు, నరసయ్య, నలబోతు కోటేశ్వరరావు, సూరాబత్తిని హనుమంతరావు, మద్దిరెడ్డి కేశవరెడ్డి, గుంటూరు ఆంజనేయులు, వజ్జా హనుమంతరావు, గుండాల శాంతయ్య, తులవ శ్రీనివాస్, సల్లూరి రామారావులు నగదు బహుమతులు ప్రదానం చేశారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 514.60 అడుగులు ఉంది. ఇది 139.61 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

1,18,944 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,12,028 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,18,944 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 51,104 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	13500
334	9500	13000	షార్క్-1	10000	12000
నంబరు.5	10000	12500	బ్యాడిగి 355	10000	13000
273	10000	12400	సింజెంటా		
341	10000	13000	బ్యాడిగి 5531	--	--
4884	10000	11300	దేవనూరుడీలక్స్	10000	12400
సూపర్10	10000	12600	ఆర్మూరు	9800	11000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తాలుకాయలు	4500	6500

పాలీసెట్ హాల్ టికెట్లు విడుదల

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 30న నిర్వహించనున్న పాలీసెట్ హాల్ టికెట్లు విడుదల చేసినట్టు సాంకేతిక విద్యా శాఖ, శిక్షణ బోర్డు గురువారం తెలిపింది. విద్యార్థులు ఏపీ పాలీసెట్ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఓ ప్రకటనలో పేర్కొంది. హాల్ టికెట్లు కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలని, పోస్టు లేదా ఇతర ఆఫ్ లైన్ మార్గాల్లో పంపబోమని స్పష్టం చేసింది. విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా ముందుగానే హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది.

రైతు ఉత్పత్తి సంఘాల ప్రోత్సాహానికి కమిటీలు

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాల్ని సమర్థంగా అమలు చేయడానికి, రాష్ట్రంలో 10 వేల రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రోత్సాహం అందించే లక్ష్యంతో రాష్ట్ర స్థాయిలో సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయిలో పర్యవేక్షణ కమిటీల ఏర్పాటుకు సవరించిన మార్గదర్శకాలతో ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో నాబార్డు అధికారులు సభ్య కార్యదర్శులుగా ఉండే రాష్ట్ర కమిటీకి వ్యవసాయశాఖ డైరెక్టర్, జిల్లా కమిటీకి జిల్లా వ్యవసాయ అధికారి సభ్య కార్యదర్శులుగా వ్యవహరిస్తారని తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలతో సమానంగా చూడాలని తెలిపింది. ఎఫ్‌పీవోలకు ఎరువుల సరఫరా, ఎఫ్‌పీవోల ఉత్పత్తులకు మార్కెటింగ్, విలువ జోడింపునకు మౌలిక సదుపాయలు కల్పించనున్నట్టు పేర్కొంది.

జూనియర్ కాలేజీల్లో గెస్ట్ ఫ్యాకల్టీలు కొనసాగింపు

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న 957 మందిని కొనసాగించేందుకు అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 28 వరకు వారు కొనసాగుతారని తెలిపారు. మొత్తం ఏడాదిలో ఒక నెల 8 రోజులు బ్రేక్ ఉంటుందన్నారు.

చిన్నారుల కుటుంబాలకు యరపతినేని సానుభూతి

పిడుగురాళ్ల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి):కొత్తపాలెం గ్రామంలో గురువారం ఈతకు వెళ్లి బావిలో పడి మృతిచెందిన చిన్నారుల కుటుంబాలకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంఘటనా ప్రాంతానికి వెళ్లి ప్రభుత్వానికి నివేదిక పంపాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబసభ్యులకు ఫోన్‌చేసి ధైర్యం చెప్పారు. బాధితులను ఆదుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

అర్హులందరికీ రేషన్ బియ్యం అందాలి

● తహసీల్దార్ కిరణ్‌కుమార్

మాచర్లటౌన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ రేషన్ బియ్యం అందాలని తహసీల్దార్ బందెల కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో ఆయన రేషన్ డీలర్లతో సమావేశమై మాట్లాడారు. ప్రతినెలా నిర్ణీత సమయంలో రేషన్ బియ్యం కార్డుదారులకు అందించాలన్నారు. కార్డుదారులందరిచే ఈకేవైసీ చేయించాలన్నారు. సమావేశంలో సివిల్ సప్లయ్ డీటీ వెంకటరమణ, ఆర్ఐ ఇంటూరి అనిల్‌కుమార్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

పశువుల తొట్ల నిర్మాణాలకు శంకుస్థాపన

మాచవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని పశువుల తొట్ల నిర్మాణాలకు గురువారం శంకు స్థాపనలు చేశారు. వేమవరం, రేగులగడ్డ తదితర గ్రామాల్లో శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఒక్కొక్క గ్రామానికి రెండు తొట్ల చొప్పున 15 గ్రామ పంచాయతీల్లో నీటితొట్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు ఉపాధి హామి ఏపీవో కోటిరెడ్డి తెలిపారు. ఒక్కొక్క తొట్టి నిర్మాణానికి రూ.30వేలు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. తొట్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని తద్వారా పశువులకు నీరు అందుబాటులో వస్తుందన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు ఆనందరావు, పంచాయతీ సెక్రటరీ ఉషారాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దాచేపల్లిలో క్రెడిట్ క్యాంపు

దాచేపల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం క్రెడిట్ క్యాంపు నిర్వహించారు. ఈ క్రెడిట్ క్యాంపునకు 85మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. బ్యాంక్ మేనేజర్లు వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు.

వైభవంగా చెన్నుని 16వ రోజు పండుగ

మాచర్లటౌన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి 16వ రోజు పండుగను గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యాన వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త గుంటుపల్లి వెంకటగాంధీ, కంభంపాటి చంటి, గాజుల వెంకట అనంత గణేష్, కొమెర అనంతరాములు, బాబి, సూరే యలమంద, వజ్రంనాయక్, మున్నా రాంబాబు, లక్ష్మణ్, లాలు తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహిస్తున్న అధికారులు

ఘనంగా పంచాయతీ రాజ్ దినోత్సవం

రాజుపాలెం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాజుపాలెం మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పంచాయతీరాజ్ సంస్థలు సక్రమంగా పనిచేసి గ్రామాలను అభివృద్ధిదిశగా అడుగులు వేయించాలన్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన

నకరికల్లు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటుతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన సాధ్యమైందని ఈవోపీఆర్‌డీ కేవీఎస్ ప్రసాదు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీపీ మేచారపు అనురాధ కేక్ కట్ చేశారు. మాజీ ఎంపీపీలను, సర్పంచ్‌లు, పంచాయతీరాజ్ ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ఉసర్తి శ్రీనివాసరావు, కరిముల్లా, ప్రసాదు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మాచవరం మండలంలో..

మాచవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మాచవరం మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అన్ని సచివాలయాల్లో గ్రామసభలు నిర్వహించి మహాత్మాగాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాల క్లాప్‌మిత్రలను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యడ్లపల్లి రామారావు, ఎంపీడీవో వెంగళరావు, డీటీ స్రవంతి, ఏవో ప్రసాదు, ఏఈ నాగేశ్వరరావు, ఏపీవో కోటిరెడ్డి, పంచాయతీల కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ

విద్యార్థులకు ఆర్డీవో అభినందన

గురజాలటౌన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గురజాల డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో గురువారం విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ఎంఈవోలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పాలవ్యాను ఢీకొని యువకుడి మృతి



మహేష్ (పాతచిత్రం)

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పాలవ్యాను ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని రెంటపాళ్ళ-దీపాలదిన్నెపాలెం గ్రామాల మధ్య గురువారం రాత్రి జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు గుడిపూడికి చెందిన షట్టు మహేష్(24) క్రోసూరులోని ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రెంటపాళ్ళ నుండి ద్విచక్రవాహనంపై దీపాళదిన్నెపాలెం వెళుతుండగా మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న పాలవ్యాను ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో మహేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. రూరల్ పోలీసులు ఘటన స్థలానికి వెళ్ళి మృతదేహాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మహేష్ తల్లిదండ్రులు పద్మ, సాంబశివరావులు మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు.



సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలోని రక్త నిల్వ కేంద్రం

రక్త నిధి సేకరణ ఏది?

● ఏరియా వైద్యశాలలో రక్త నిల్వల కొరత

● డొనేషన్ ఉంటేనే బ్లడ్ ఇచ్చే పరిస్థితి

సత్తెనపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలోని రక్త నిల్వ కేంద్రంలో రక్తం లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు నిత్యం అధిక సంఖ్యలో రోగులు వస్తుంటారు. నెల నెలా గర్భిణీలు, ఇతర రోగులకు 30 ప్యాకెట్ల వరకు రక్తం అవసరమవుతుంది. కానీ ఏరియా వైద్యశాలలోని రక్త నిల్వల కేంద్రంలో ఒక ప్యాకెట్ మాత్రమే రక్త నిల్వ ఉంది. కనీసం 25 ప్యాకెట్ల వరకు రక్తనిల్వలు ఉండాలి. సంబంధిత బ్లడ్ బ్యాంక్ నిల్వ కేంద్రం సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రక్తనిల్వలు లేవని విమర్శలు వినిపిస్తున్నాయి. రక్తం కావాలంటే వెంట డోనర్లను తెచ్చుకొని నరసరావుపేటలోని మదర్ బ్లడ్‌బ్యాంక్‌కు వెళ్ళాల్సివస్తుంది. బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది రక్త సేకరణ చేయకపోవటమే ఇందుకు కారణంగా తెలుస్తుంది. కేవలం ఆస్పత్రికి స్వచ్ఛందంగా వచ్చేవారితోనే రక్తం సేకరిస్తున్నారు. రక్త సేకరణ కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేయాల్సిన బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది పట్టీపట్టనట్టు వ్యవహరించటం వల్ల రక్త నిల్వలు నిండుకున్నాయి. రోగులకు అత్యవసర సమయంలో బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది చేతులు ఎత్తివేయటంతో ప్రైవేట్ రక్త కేంద్రాలకు రోగులు పరుగులు తీస్తున్నారు. ప్రస్తుతం ఎండ తీవ్రత ఉండటంతో దాతలు రక్తం ఇవ్వటానికి ముందుకురావటం లేదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు తెలిపారు.



భీమవరంలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

అభివృద్ధి బాట పడుతున్న పల్లెలు

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధే లక్ష్యంగా నూతన ప్రభుత్వం పని చేస్తుందని, గత ఐదు సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని పల్లెలు నేడు అభివృద్ధి బాట పడుతున్నాయని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయన అన్నారు. మండలంలో భీమవరం, గండ్లూరు గ్రామాల్లో గురువారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎక్కడా ఒక్క నిర్మాణం కూడా చేపట్టలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. పల్లె పండుగలో ఇచ్చిన హామీల్లో భాగంగా భీమవరం గ్రామంలో రూ.8లక్షలతో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్, రూ.8లక్షలతో నిర్మించిన మురుగు కాలువలు, రూ.5లక్షలతో నిర్మించిన కల్వర్టును ఎమ్మెల్యే ప్రారంభించారు. గుండ్లూరులో ఎంపీపీ స్కూల్‌లో రూ.10లక్షలతో నిర్మించిన ప్రహరీని ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామంలో జరిగిన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవంలో గర్భిణీలకు పౌష్టికాహారాన్ని పంపిణీచేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు యోనా, పేరం శకుంతల, బలుసుపాటి వెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకులు తొరటి వెంకటరావు, వంటిపులి అంకమ్మ, పసుమర్తి బాబు, బొడ్డు సురేష్, ఒంటిపులి మహేశ్వరి, నలజాల సత్యనారాయణ, శేషయ్య, నలజాల అప్పారావు, దరువూరి నాగేశ్వరరావు, మక్కపాటి రామచంద్రరరావు, కోమటినేని శ్రీనివాసరావు, బి.వెంకటస్వామి, బి.శ్రీనివాసరావు, ఒంటిపులి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

దుర్గి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి సమావేశాలు నిర్వహించారు. దుర్గిలోని పంచాయతీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో జడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద ప్రసంగించారు. సమావేశంలో ఎంపీడీవో శివప్రసాద్, ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, ఏపీవో మల్లికార్జునరావు పాల్గొన్నారు.

స్థానిక స్వపరిపాలనకే పంచాయతీరాజ్

● ఎంపీడీవో సరోజనిదేవి

రెంటచింతల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజల అభ్యున్నతి,క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం కోసం జాతీయ పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటైందని ఎంపీడీవో కె. సరోజనిదేవి అన్నారు. గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా వివిధ శాఖల అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, సెక్రటరీ కోటేశ్వరరావు, గొంటు సుమంత్‌రెడ్డి, బోడపాటి రామకృష్ణ, ఎన్ఆర్ఈ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కోనూరులో...

అచ్చంపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనూరు గ్రామంలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ వ్యవస్థ దినోత్సవం నిర్వహించినట్లు గ్రామకార్యదర్శి బత్తుల శివయ్య తెలిపారు. కార్యక్రమానికి టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, తాళ్ళూరి లక్ష్మీనారాయణ, దాములూరి శ్రీనివాసరావు, మచ్చా సుధాకర్, జంగా శివ, వెల్ఫేర్ అసిస్టెంట్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సేవల్లో అంతరాయం ఉండదు

సీజీజీబీ చీఫ్ మేనేజర్ శివశంకర్‌నాయక్

క్రోసూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌తో సహా మరో రెండు బ్యాంకులు కలిపి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా ఏర్పడినప్పటికీ ఖాతా దారుల సేవల్లో ఎటువంటి అంతరాయం ఉండదని డొడ్లేరు సీజీజీబీ చీఫ్ మేనేజర్ శివశంకర్ నాయక్ అన్నారు. గురువారం బ్యాంక్ ఆవరణలో పేరు మార్పుపై ఖాతా దారులకు అవగాహన కల్పించారు. ఖాతా దారుల నెంబర్లు అవే ఉంటాయని చెప్పారు. బ్యాంకు లావాదేవీలు యధావిధిగా కొనసాగుతాయన్నారు. అమరావతి ప్రధాన కేంద్రంగా ఉంటుందని ఆయన తెలిపారు. ప్రయోజిత బ్యాంకుగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవహరిస్తుందన్నారు. మే 1వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ సేవలు ప్రారంభమవుతాయని తెలిపారు. బ్యాంక్ సీనియర్ మేనేజర్ కోటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కావ్యశ్రీని అభినందిస్తున్న డీఈవో చంద్రకళ తదితరులు

కావ్యశ్రీకి డీఈవో చంద్రకళ అభినందన

కారంపూడి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కారంపూడిలోని బ్రహ్మనాయుడు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని కోనేటి కావ్యశ్రీ పదో తరగతి ఫలితాల్లో 590 మార్కులు సాధించి జిల్లా ప్రథమంగా నిలిచింది. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో విద్యార్థిని కావ్యశ్రీని డీఈవో చంద్రకళ అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనంతశివ, ఉపాధ్యాయులు పిన్నెల్లి వెంకటేశ్వర్లు, తగిరస రఘుబాబు, హైమావతి, ఎంఈవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో మాట్లాడుతున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్

విద్యార్థినుల అత్యుత్తమ ఫలితాలు అభినందనీయం

● తహసీల్దార్ కిరణ్‌కుమార్

మాచర్ల రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినుల అత్యుత్తమ ఫలితాలు అభినందనీయమని తహసీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. విద్యార్థిని షేక్ సమీరా 596 మార్కులతో రాష్ట్రస్థాయిలో రెండోస్థానంలో నిలిచింది. అలాగే మరో 33మంది విద్యార్థినులు 500లకు పైగా మార్కులు సాధించారు. గురువారం రాత్రి హెచ్‌ఎం షకీనా, ఎంఈవో సురేష్, ఉపాధ్యాయులు విద్యార్థినులతో కలిసి పట్టణంలో ర్యాలీ జరిపారు. ర్యాలీలో తహసీల్దార్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు.

కేంద్రియ విద్యాలయంలో ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

సత్తెనపల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణాపురంలో గల కేంద్రియ విద్యాలయంలో గురువారం 54వ రీజనల్ స్థాయి అండర్-17 బాలికల వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. 8టీమ్‌లు పోటీల్లో పాల్గొనగా లీగ్‌కమ్‌నాకౌంట్ పద్ధతిలో పోటీలు జరిగాయి. పోటీల్లో నాలుగు టీమ్‌లు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయని విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బీ కిరణ్‌రెడ్డి తెలిపారు. పోటీల్లో రిఫరీలుగా ఎం శేషగిరిరావు, ఈ రవీంద్ర, ఎం నరసింహారావు, ఎస్‌కే మహమ్మద్ రియాజ్, గోవిందు, లక్ష్మీపతిలు వ్యవహరించారు. సత్తెనపల్లి, ఖమ్మం, తెనాలి, వాల్తేరు టీమ్‌లు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి.



కేంద్రియ విద్యాలయంలో జరుగుతున్న బాలీబాల్ పోటీలు

రీ సర్వే రైతులకు ఎంతో మేలు

● తహసీల్దార్ అస్రిఫున్నీసాబేగం

బెల్లంకొండ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రీసర్వేతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తహసీల్దార్ అస్రిఫున్నీసాబేగం పేర్కొన్నారు. గురువారం మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో రీసర్వే గ్రామసభ నిర్వహించారు. ముందుగా రీసర్వే వల్ల రైతులకు చాలా లాభదాయకం అంటూ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభలో తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు పొలాలకు రీసర్వే చేయించుకోవాలని ఆమె సూచించారు. అప్పుడే సరైన నెంబర్లు ఉంటాయని పేర్కొన్నారు. రైతులందరూ అధికారులకు సహకరించి రీసర్వే చేయించుకొనేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటారని, రైతుల సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే తెలియపరిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ బీసీ ప్రధాన కార్యదర్శి ఓర్సు ఆనంద్, డీటీ బాషా, సర్వేయర్లు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

క్రోసూరులో క్లీన్ అండ్ గ్రీన్‌కు సహకరించాలి

క్రోసూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): క్రోసూరును క్లీన్ అండ్ గ్రీన్‌గా తయారు చేసేందుకు ప్రజలందరూ సహకరించాలని సర్పంచ్ చందమామ పిలుపునిచ్చారు. పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధించటానికి కృషి చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. అమరావతి బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటుచేశారు. క్రోసూరులో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కే వెంకయ్య, జూనియర్ అసిస్టెంట్ ఆదినారాయణ, ఉపసర్పంచ్ షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి

అచ్చంపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పూరు గ్రామంలో గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు పొన్నెకంటి హరీష్ అనే యువకునిపై దాడిచేసినట్లు సీఐ పీ శ్రీనివాసరావు తెలిపారు. హరీష్ నిద్రిస్తున్న ఇంటిలోకి ఇద్దరు వ్యక్తులు ప్రవేశించి హరీష్ ముఖంపై దిండువేసి తీవ్రంగా గొంతు నొక్కారు. అలికిడికి సమీపంలోని వారు వచ్చి వారిని పట్టుకోబోవటంతో తప్పించుకొని పారిపోయినట్టు తెలిపారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ వచ్చి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

కాపునాడు, మహిళా కాపు నాడు కార్యవర్గ సమావేశం

అచ్చంపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలో గురువారం సాయిబాబా కల్యాణ మండపంలో పెదకూరపాడు, సత్తెనపల్లి, గురజాల నియోజకవర్గాల్లోని కాపు నాడు, మహిళా కాపునాడు, యువకాపునాడు కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ళ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర కాపునాడు ఉపాధ్యక్షుడు శ్రీ లక్ష్మీశెట్టి పార్థసారధి ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో మండల కాపు నాడు, యువ కాపునాడు, మహిళా కాపునాడుతో పాటు రాష్ట్ర, జిల్లా నియోజకవర్గ నాయకులు హాజరయ్యారు. కాపునాడు పల్నాడు జిల్లా అధ్యక్షుడు పోలిశెట్టి వెంకట సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.



రాజుపాలెంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన మండల అధ్యక్షుడు తోట నరసయ్య, కూటమి నేతలు

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

మృతులకు జనసేన నేతలు సంతాపం

రాజుపాలెం, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడికి నరసనగా రాజుపాలెంలో గురువారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ రాజుపాలెంలోని జనసేన పార్టీ కార్యాలయం నుండి ప్రారంభమై గుంటూరు-మాచర్ల ప్రధాన రహదారిలో పోలీసు స్టేషన్ వరకు సాగింది. ఉగ్రవాదులను ఉరితీయాలని నినాదాలుచేశారు. ర్యాలీలో జనసేన మండల అధ్యక్షుడు తోట నరసయ్య, ఉపాధ్యక్షుడు బత్తుల హనుమంతరావు, టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు నెల్లూరి అహల్యారాణి, కూటమి నాయకులు పులిబండ్ల సాంబశివరావు, పెద్దింటి శ్రీనివాసరావు, తోట సుబ్బారావు, నారదశెట్టి కోటేశ్వరరావు, చెవుల ఆంజనేయులు తదితరులున్నారు.

● నకరికల్లు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఉగ్రదాడిని నిరసిస్తూ గురువారం నకరికల్లులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

గురజాలటౌన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఉగ్రదాడిలో మరణించిన 28మంది భారతీయులకు గురువారం జనసేన నేతలు సంతాపం తెలిపారు. పట్టణంలో జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త కటకం అంకారావు ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అంకారావు మాట్లాడుతూ ఉగ్రవాదుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టీడీపీ, బీజేపీ నేతలు మద్దతు తెలిపారు.

● దాచేపల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ దాచేపల్లిలో నిర్వహించారు. గురువారం దాచేపల్లిలో కూటమి నేతలు, అజాద్ హిందూ ఫౌజ్ సభ్యులు మాట్లాడుతూ ఉగ్రదాడి పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ప్రభుత్వం తీవ్రవాదులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. ర్యాలీలో అన్ని రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.



గురజాలలో సంతాపం తెలుపుతున్న జనసేన నేతలు



ఇన్‌చార్జి మంత్రి రవితో ఎమ్మెల్యే జూలకంటి, చైర్మన్ నరసింహారావు, కౌన్సిలర్లు

ఇన్‌చార్జి మంత్రితో ఎమ్మెల్యే జూలకంటి భేటీ

మాచర్లటౌన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): అమరావతిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవిని గురువారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డితోపాటు మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కౌన్సిలర్లు కలిశారు. ఈనెల 28వ తేదీన మాచర్ల మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక జరగనుంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే జూలకంటి, చైర్మన్, 21 మంది కౌన్సిలర్లు ఇన్‌చార్జి మంత్రి రవిని కలవడం చర్చనీయాంశమైంది. వైసీపీ నుంచి కౌన్సిలర్లు టీడీపీలోకి చేరి మద్దతుగా నిలవడంతో ఈనెల 28వ తేదీన జరగనున్న వైస్‌చైర్మన్ ఎన్నిక ప్రాధాన్యతను సంతరించుకుంది. మొత్తం 31మంది కౌన్సిలర్లకు గాను 21మంది కౌన్సిలర్లు ఇప్పటికే వైసీపీని వీడి టీడీపీలో చేరారు. మంత్రిని కలిసిన కౌన్సిలర్లలో ముదిశెట్టి శ్రీనివాసరావు, యర్రాకుల సిద్ధయ్య, నరసింహారావు, గట్ల అరుణ, జ్యోతి, శ్యామల తదితరులు ఉన్నారు.

ఏపీ జెన్‌కోకు 100 ఎకరాల స్థలం అప్పగింత

రెంటచింతల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కృష్ణానది ఒడ్డునగల సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో సోలార్ పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు లభించినట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. గురువారం ఆంధ్రజ్యోతితో ఫోన్లో మాట్లాడుతూ విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ మేరకు పేర్కొన్నట్లు చెప్పారు. 833 సర్వేనెంబర్లో 112 ఎకరాలుండగా అందులో 100 ఎకరాల్లో సోలార్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. సర్వేయర్ల నివేదికకు కలెక్టర్ ఆమోదం తెలిపి ఆ భూమిని ఏపీ జెన్‌కోకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు. గతంలో 5 ఎకరాల్లో 1 మెగావాట్ విద్యుత్ చొప్పున 100 ఎకరాల్లో 20 మెగావాట్ల కరెంట్ తయారీకి ప్రణాళికలు రూపొందించారని, అధునాతన టెక్నాలజీతో 3 ఎకరాల్లోనే 1 మెగావాట్ విద్యుత్ తయారయ్యేలా చర్యలు చేపట్టబోతున్నట్లు చెప్పారు. ఆ లెక్కన 30 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి 90 ఎకరాలు పోగా మిగతా 10 ఎకరాల్లో ప్రభుత్వ భవనాలు, రహదారులు, కంట్రోల్ రూమ్, ఉద్యోగుల క్వార్టర్స్ నిర్మిస్తారని పేర్కొన్నారు. పవర్‌ప్లాంట్ ఏర్పాటులో చొరవచూపిన సీఎం చంద్రబాబు, మంత్రి గొట్టిపాటికి కృతజ్ఞతలు తెలిపారు.



మేకలగొంది వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వాటర్‌గ్రిడ్ స్థలాన్ని పరిశీలించిన అధికారులు

మాచర్ల రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లో గల మేకల గొంది నుంచి జలజీవన్ మిషన్ ద్వారా రూ.1200 కోట్లతో మాచర్ల నియోజకవర్గంతోపాటు పల్నాడు ప్రాంతానికి తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో అధికారులు గురువారం సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. ఫారెస్ట్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల బృందం సుమారు 20 ఎకరాల ప్రభుత్వ భూమిని వాటర్ గ్రిడ్ కోసం కేటాయించేందుకు సాగర్ జలాశయం వద్దగల మేకలగొంది ప్రాంతాన్ని గుర్తించారు. ఇందుకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. ఈ పరిశీలనలో గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, మార్కాపురం సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, మాచర్ల తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కాశిరెడ్డి, ఇరిగేషన్ జేఈ హిమబిందు, ఫారెస్ట్ రేంజర్ సుజాత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేందర్‌రెడ్డి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వెంకట్రావు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

పెదకూరపాడు గైనకాలజిస్టుగా డాక్టర్ సుజాత

పెదకూరపాడు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు సామాజిక ఆరోగ్యకేంద్ర గైనకాలజిస్టుగా డాక్టర్ కూచిపూడి సుజాత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆరోగ్యట్రస్ట్ ఫీల్డ్ ఆపరేషన్ సపోర్టింగ్ సిస్టమ్ జాయింట్ ఎగ్జిక్యూటివ్ అధికారిగా బాధ్యతలునిర్వహించి బదిలీపై పెదకూరపాడు వచ్చారు.

హసానాబాద్ జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సత్కారం

క్రోసూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హసానాబాద్ జడ్పీ హైస్కూల్ విద్యార్థులను గురువారం గ్రామపెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా 584 మార్కులు సాధించిన షేక్ ఆస్మా, 557 సాధించిన కె.సుధ, 538 సాధించిన వి.అఖిల, 500కు పైగా సాధించినవారిని సన్మానించారు. గ్రామ సర్పంచ్ వీరయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో గురువారం 27.46 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 4వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

సివిల్స్‌కు నరసరావుపేట యువతి అంబటి యామిని ఎంపిక

తండ్రి ప్రేరణ..తల్లి కష్టం



నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణానికి చెందిన, దిగువ మధ్యతరగతి కుటుంబం నుంచి అంబటి యామిని సివిల్స్‌కి ఎంపికైంది. సివిల్స్ చేస్తే దేశానికి సేవలు అందించవచ్చని ప్రేరేపించిన తండ్రి సాంబశివారెడ్డి అనారోగ్యంతో గతించారు. టైలరింగ్‌తో తల్లి వెంకటరమణి కష్టపడి అంబటి యామినిని చదివించింది. ఐదవ తరగతి వరకు పట్టణంలోని ప్రకాష్ నగర్‌లో ఉన్న సెయింట్‌ఆన్స్ చదివిన యామిని.. ఆరు నుంచి 10వ తరగతి వరకు మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయంలో చదివింది. ఇంటర్మీడియెట్ హెచ్‌ఈజీ(హిస్టరీ, ఎకానామిక్స్, జాగ్రఫీ) గ్రూపు హైదరాబాద్ మెహదీపట్నంలో ఉన్న విజయవర్ధిని జూనియర్ కాలేజ్‌లో పూర్తి చేసింది. ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని మేరిండా హౌస్ నుంచి జాగ్రాఫీలో హానర్స్ పూర్తి చేశారు. రెండవ ప్రయత్నంలో సీవిల్స్‌లో 591 ర్యాంక్ సాధించి ఐఆర్ఎస్‌కు అంబటి యామిని ఎంపికైంది. దీంతో ఆమె ఇంటిలో సంతోషాలు వెల్లివిరిశాయి. పలువురు స్నేహితులు, బంధువులు యామినిని అభినందించారు.

ఐఏఎస్‌కు ఎంపిక కావడమే అసలు లక్ష్యం

అంబటి యామిని మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో శిక్షణ పొంది, ముగ్గురు స్నేహితులు గ్రూపుగా ఏర్పడి ఐఏఎస్‌కు సిద్ధం అయ్యాయమని తెలిపింది. ఐఆర్ఎస్‌కు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. రెండవ ప్రయత్నంలో ఎంపిక అయ్యాయనని, ఐఏఎస్‌కు ఎంపిక కావడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.



ఉప ముఖ్యమంత్రిని ఆకర్షించిన..

జిందాల్ ప్లాంట్ నమూన

గుంటూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జిందాల్ సంస్థ నిర్వహిస్తున్న వేస్టు టూ ఎనర్జీ ప్లాంట్ నమూన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ని విశేషంగా ఆకట్టుకుంది.. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం జరిగిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో భాగంగా ఎగ్జిబిషన్ స్టాల్‌ని ఏర్పాటు చేశారు. అందులో జిందాల్ సంస్థ తన ప్లాంట్ నమూనని ప్రదర్శనకు ఉంచింది. డిప్యూటీ సీఎంతో పాటు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు, గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఈ ప్రదర్శనని తిలకించారు. ఈ సందర్భంగా జిందాల్ సంస్థ ప్రతినిధి చెత్త నుంచి విద్యుత్‌ని ఎలా ఉత్పత్తి చేసేది డిప్యూటీ సీఎంకు వివరించారు. దాదాపుగా మూడు కార్పొరేషన్లు, ఐదు మునిసిపాలిటీలు, చుట్టుపక్కల గ్రామాల్లో నిత్యం ఉత్పత్తి అవుతున్న చెత్తని ఇక్కడికి తీసుకొచ్చి విద్యుత్ ఉత్పాదన చేయడం జరుగుతోందని నివేదించారు. 1,200 టన్నుల చెత్త నుంచి గంటకు 15 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. అధునాతన యూరప్ సాంకేతిక పరిజ్ఞానంతో దీనిని ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నామని, ప్రత్యక్షంగా 200 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. విద్యుత్ గ్రిడ్‌కు ఈ ప్లాంట్‌ని అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఇంకెన్ని ప్రాంతాల్లో ఇలాంటి ప్లాంట్లు ఉన్నాయని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వాకబు చేశారు.

టుబాకో బోర్డు చట్టంలో సవరణలు

గజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్ర వాణిజ్య శాఖ

గుంటూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పొగాకు బోర్డు చట్టం నిబంధనలు- 1976లో కేంద్ర వాణిజ్య శాఖ కొన్ని సవరణలు తీసుకొచ్చింది. ఈ మేరకు అధికారిక గజిట్ నోటిఫికేషన్‌ని విడుదల చేసింది. ఈ నిబంధనలను టుబాకో బోర్డు(సవరణ) రూల్స్ 2025గా నిర్ణయించింది. కాగా టుబాకో బోర్డు రూల్స్ 1976లో రూల్ 33, సబ్ రూల్స్(5), (6), (7)కు సవరణలను చేసింది. (5) సెక్షన్ 10 కింద మంజూరు చేసిన ప్రతి రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ ఫారం-2లో ఉండాలి. అలాంటి సర్టిఫికేట్‌లో పేర్కొన్న మూడు సంవత్సరాల బ్లాక్ పీరియడ్‌కు సర్టిఫికేట్ చెల్లుబాటు అవుతుంది. (6) రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ పునరుద్ధరణ మూడేళ్ల బ్లాక్ పీరియడ్ కోసం ఆమోదించబడుతుంది. (7) రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ప్రతి సర్టిఫికేట్/రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ కేవలం మంజూరు చేయబడిన బ్లాక్ వ్యవధికి మాత్రమే చెల్లుబాటు అవుతుంది. (8) సబ్ రూల్(4) కింద నిర్దేశించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ కింద కవర్ చేసిన ప్రాంతం కోసం చెల్లించాల్సిన ఫీజు, రిజిస్ట్రేషన్/రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ కోసం నియమం 33ఏ సబ్ రూల్(2) కింద ఏర్పాటైన కమిటీ ద్వారా నిర్దేశించబడిన ప్రమాణాల ప్రకారం ఉండాలి. పేర్కొన్న నియమాల్లో నిబంధన 34ఎన్‌లో ఉప నిబంధనలు (2), (3) కోసం బ్యారన్ నిర్వహణ నిమిత్తం పొందిన లైసెన్సు మూడేళ్ల ప్రతి బ్లాక్ కాలానికి పునరుద్ధరించబడాలి. అలా పునరుద్ధరించకపోతే అది మంజూరు చేసిన మూడేళ్ల బ్లాక్ వ్యవధి ముగిసే సమయానికి చెల్లుబాటులో ఉండదు. అలాంటి పునరుద్ధరణ కోసం దరఖాస్తుని తాజాగా అప్లికేషన్ కోసం చేసిన విధంగానే ప్రాసెస్ చేస్తారు. లైసెన్సు /బ్యారన్ నిర్వహణ నిమిత్తం లైసెన్సు పునరుద్ధరణ కోసం ప్రతి దరఖాస్తు ఫాం 25లో ఉండాలి. అందులో పేర్కొన్న వివరాలను కలిగి ఉండాలి. ప్రతి బ్యారన్‌కు సంవత్సరానికి రూ. 10 రుసుము కూడా చెల్లించాలి. గతంలో లైసెన్సు ఏడాదికి పరిమితం అయ్యేది. ఇప్పుడు దానిని బ్లాక్ పీరియడ్ వరకు అమలులో ఉండేలా సవరించారు. ఫాం 25, ఐటెం నంబరు 9కి సంబంధించి దరఖాస్తుదారుడు రిజిష్టర్డ్ వర్జీనియా పొగాకు ఉత్పత్తిదారుడు అయిన పక్షంలో రిజిస్ట్రేషన్ నంబరు, తేదీ, బ్లాక్ పీరియడ్‌ని పేర్కొనాల్సి ఉంటుంది. పొగాకు బోర్డు చట్టంలో చేసిన సవరణలు గజిట్ ప్రచురించిన రోజు నుంచే అమలులోకి వస్తాయని కేంద్ర వాణిజ్య శాఖ పేర్కొంది.

అప్పుడు అంతంతమాత్రం.. ఇప్పుడు అత్యంత వేగం

తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో క్రిటికల్ కేర్ యూనిట్

తెనాలిరూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే రెండో అతి పెద్ద వైద్యశాలగా పేరుపొందిన తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి సత్వరం వైద్యం అందించేలా క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ భవనానికి శంకుస్థాపన చేయగా నిర్మాణ పనులు ఈ నెలాఖరుకు పూర్తిచేసి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం పనులకు అవసరమైన బిల్లులను మంజూరు చేసింది. కానీ, వైసీపీ ప్రభుత్వం వాటిని సకాలంలో మంజూరు చేయకపోవడంతో పనులు అంతంతమాత్రంగా సాగాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి బిల్లులను సకాలంలో విడుదల చేసింది. పేదల ఆరోగ్యానికి భరోసాగా నిలవాలన్న ఉద్దేశంతో తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో నత్తనడకన సాగుతున్న క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణంపై ప్రత్యేక దృష్టిపెట్టి.. పనులు వేగవంతం చేయించింది. వైసీపీ హయాంలో గ్రావెల్ మాఫియా రాజ్యమేలిన నేపథ్యంలో క్రిటికల్ కేర్ యూనిట్‌కు మాత్రం అవసరమైన మట్టిని సమకూర్చలేకపోయిందన్న ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం.. గత ప్రభుత్వ తప్పిదాలను పునరావృతం కాకుండా గ్రావెల్ తవ్వకాలను పూర్తిగా నిలుపుదల చేసింది. దీంతో మట్టికి బదులు ఇసుకతో లెవలింగ్ చేసి పనులు మరింత నాణ్యతా ప్రమాణాలతో ముందుకు సాగిస్తోంది. 2027 నాటికి క్రిటికల్ కేర్ యూనిట్ సేవలందించేందుకు లక్ష్యంగా పెట్టుకుంది.

వైద్య సేవలు ఇలా..

తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు పరిసర ప్రాంతాల ప్రజలేకాక వేమూరు, అమృతలూరు, కొల్లూరు, రేపల్లె, చుండూరు, కొల్లిపర, దుగ్గిరాల, చేబ్రోలు పలు మండలాల ప్రజలు వైద్య కోసం వస్తుంటారు. అయితే ఇక్కడ క్రిటికల్ కండిషన్‌లో ఉన్న రోగులకు తక్షణ వైద్యం అందించే అవకాశంలేదు. రోగికి ఆక్సిజన్ తక్కువ స్థాయికి పడిపోతే గుంటూరు సమగ్ర వైద్యశాలకు రిఫర్ చేస్తుంటారు. దీనిని దృష్టిలో ఉంచుకుని, రోగులకు అన్ని రకాల వైద్య సేవలందించాలన్న ఉద్దేశంతో ఇక్కడ 100 పడకలతో క్రిటికల్ కేర్ యూనిట్‌ను నిర్మించేలా కేంద్ర ప్రభుత్వం అవసరమైన నిధులను మంజూరు చేసింది. గ్రౌండ్ ఫ్లోర్ కాకుండా నాలుగు ఫ్లోర్లతో దీనిని నిర్మించేందుకు రూ.45 కోట్లు వెచ్చించింది. ఈ నిధుల నుంచి రూ.22 కోట్లు భవన నిర్మాణానికి కేటాయించగా.. మిగిలిన నిధులను ఆపరేషన్ థియేటర్, క్యాజువాలిటీల్లో వస్తువుల కొనుగోలు, వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు వినియోగించనున్నారు. క్రిటికల్ కేర్ యూనిట్ భవనంలో ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయూ) విభాగానికి 20 పడకలతో చిన్న పిల్లలకు అవసరమైన నాలుగు సపరేట్ బెడ్‌లతో ఏర్పాటు చేయనున్నారు. హైడిఫినిషన్ యూనిట్(హెచ్‌డీయూ) 20 పడకలు, ఐసోలేషన్ వార్డు 30 పడకలు, ఐసోలేషన్ గదులు 12, డయాలసిస్ బెడ్‌లు 4, బాలింతలకు (ఎంసీహెచ్) 4 బెడ్‌లు అత్యవసర విభాగం 10 బెడ్లుగా ఏర్పాటు చేయనున్నారు. ఇవి కాకుండా మూడవ అంతస్తులో రెండు ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేస్తారు. ఈ యూనిట్ అందుబాటులోకి వస్తే క్రిటికల్ కండిషన్‌లో వచ్చే రోగులను జీజీహెచ్‌కు రిఫర్ చేసే అవకాశం తగ్గడంతో పాటు.. తక్షణ వైద్యం అందించి ప్రాణాలు నిలబెట్టవచ్చు.



తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ యూనిట్ భవనం

- మూడు అంతస్తుల్లో సేవలందించేలా భవన నిర్మాణం
- రూ.45 కోట్లలో రూ.22 కోట్లతో భవనం, మౌలిక వసతుల కల్పన
- ఈ ఏడాది ప్రారంభం లక్ష్యం.. బిల్లుల జాప్యంతో నత్తనడకన పనులు
- కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి.. 2027నాటికి సేవలు



పనులు చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

రాజధాని సభకు 1.20 లక్షల మంది



- మే 2న రాజధాని అమరావతి పునర్నిర్మాణ సభ
- కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఏలూరు జిల్లాల నుంచి జనం రాక
- ప్రధాని మోదీ రోడ్డు షోకు హాజరుకానున్న 30 వేల మంది
- సభ ప్రాంగణంలోని గ్యాలరీలకు తరలిరానున్న మరో 90 వేల మంది
- 2,400 బస్సుల్లో ఏడు రూట్లలో సభ వద్దకు చేరనున్న ప్రజలు

విజయవాడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి 1.20 లక్షల మంది రానున్నట్లు సమాచారం. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల నుంచి వీరు తరలివస్తున్నట్లు తెలిసింది. గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి 30 వేల మంది చొప్పున, కృష్ణా, బాపట్ల, ఏలూరు జిల్లాల నుంచి 10 వేల మంది చొప్పున వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధాన సభా ప్రాంగణం 28 ఎకరాల్లో నిర్మిస్తున్నారు. ప్రధాన వేదికలు పోను గ్యాలరీలను 25 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నారు. సభలో సీటింగ్ 50 వేల వరకు ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే వారు, వెళ్లే వారు ఉంటారు కాబట్టి మొత్తంగా 1.20 లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నారు. వీరిలో 30 వేల మంది ప్రధాని రోడ్డు షోకు వెళ్తారని సమాచారం. మే 2న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

2,400 బస్సులు ఏర్పాటు

రాజధాని సభకు వచ్చే వారికి ప్రభుత్వం 2,400 బస్సులను ఏర్పాటు చేయనుంది. గుంటూరు నుంచి 600, ఎన్టీఆర్ జిల్లా నుంచి 600, పల్నాడు జిల్లా నుంచి 600, కృష్ణాజిల్లా నుంచి 200, బాపట్ల జిల్లా నుంచి 200, ఏలూరు జిల్లా నుంచి 200 బస్సుల్లో ప్రజలు సభా ప్రాంగణానికి తరలిరానున్నారు.

ఆరు రూట్లలో సభ వద్దకు

గుంటూరు జిల్లా నుంచి 30 వేల మంది రూట్ నంబర్-4లో 200 బస్సుల ద్వారా మంగళగిరి, డాన్ బాస్కో, ఎర్రబాలెం, ఈ 8, ఈ 9 రోడ్ల మీదుగా పార్కింగ్-1 ప్లేస్‌కు చేరుకుంటారు. రూట్ నంబర్-5లో 200 బస్సుల ద్వారా ఎన్‌హెచ్-16, పశ్చిమ బైపాస్, నిడమర్రు, కురగల్లు, ఎన్-9 రోడ్డు మీదుగా పార్కింగ్-1 ప్లేస్‌కు తరలివస్తారు. రూట్ నంబర్-6లో మరో 200 బస్సుల్లో తాడికొండ, పెదపరిమి, తుళ్లూరు, ఈ 6 రోడ్డు మీదుగా పార్కింగ్-1 ప్లేస్‌కు వస్తారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి 30 వేల మంది రూట్ నంబర్ - 1 ద్వారా 600 బస్సుల్లో గొల్లపూడి, వెస్ట్ బైపాస్, వెంకటపాలెం సర్వీసు రోడ్డు, మందడం, ఎన్- 7 రోడ్డు, ఈ 8 జంక్షన్, ఈ 8, ఎన్ 8 రోడ్ల మీదుగా పార్కింగ్-6 ప్లేస్‌కు తరలివస్తారు. పల్నాడు జిల్లా నుంచి 30 వేల మంది రూట్ నంబర్-6 ద్వారా 400 బస్సులలో తాడికొండ, పెదపరిమి, తుళ్లూరు, ఈ 6 రోడ్డు మీదుగా పార్కింగ్-1 ప్లేస్‌కు వస్తారు. మరో 200 బస్సుల్లో రూట్ నెంబర్-7 ద్వారా అమరావతి, బోరుపాలెం, రాయపూడి, హైకోర్టు రోడ్డు మీదుగా ఈ 6, ఎన్ - 10 రోడ్డు మీదుగా పార్కింగ్ - 1 ప్లేస్‌కు తరలివస్తారు. కృష్ణా జిల్లా నుంచి వచ్చే 10 వేల మంది రూట్ నంబర్-3, 4 ద్వారా 200 బస్సుల్లో కనకదుర్గా వారధి, ఓటీజీ, ప్రూూ బ్రిడ్జి, నులకపేట, డాన్ బాస్కో, యర్రబాలెం, ఈ 8, ఎన్ 9 జంక్షన్ల మీదుగా పార్కింగ్ - 7 ప్లేస్‌కు వెళ్తారు. బాపట్ల జిల్లా నుంచి వచ్చే 10 వేల మంది రూట్ నంబర్ - 5 ద్వారా ఎన్‌హెచ్ - 16, వెస్ట్ బైపాస్, నిడమర్రు, కురగల్లు, ఎన్-9 రోడ్డు జంక్షన్ మీదుగా పార్కింగ్ - 1 ప్లేస్‌కు వస్తారు. ఏలూరు జిల్లా నుంచి వచ్చే 10 వేల మంది రూట్ నంబర్ - 1 ద్వారా 200 బస్సుల్లో గొల్లపూడి, వెస్ట్ బైపాస్, వెంకటపాలెం, సర్వీసు రోడ్డు, మందడం, ఎన్-7 రోడ్డు, ఈ - 8 రోడ్డు మీదుగా పార్కింగ్ - 6 ప్లేస్‌కు వెళ్తారు.

గ్యాలరీలకు జనం ఇలా..

ఆరు రూట్లలో పార్కింగ్ ప్లేసులకు చేరుకున్న వారంతా కూడా తమకు నిర్దేశించిన విధంగా కొందరు రోడ్డు షోలో పాల్గొనడానికి, మరికొందరు గ్యాలరీలలో కూర్చోవడానికి వెళ్తారు. గుంటూరు జిల్లా నుంచి వచ్చే 30 వేల మంది పూర్తిగా గ్యాలరీలలోనే కూర్చుంటారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి వచ్చే 30 వేల మందిలో 5 వేల మంది రోడ్డుషో, 25 వేల మంది గ్యాలరీలకు వెళ్తారు. పల్నాడు జిల్లా నుంచి వచ్చే 30 వేల మంది కూడా గ్యాలరీలలోనే కూర్చుంటారు. కృష్ణా, బాపట్ల జిల్లాల నుంచి వచ్చే 20 వేల మంది కేవలం రోడ్డు షోకు మాత్రమే వెళ్తారు. ఏలూరు జిల్లా నుంచి వచ్చే 10 వేల మందిలో 5 వేల మంది రోడ్డు షోకు, మరో ఐదు వేల మంది గ్యాలరీలలోకి వెళ్తారని సమాచారం.

పీఎం రోడ్డు షోకు 30 వేల మంది

ప్రధాని నరేంద్ర మోదీ దిగే హెలీప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు 15 నిమిషాల పాటు జరిగే రోడ్డు షోకు మొత్తం 30 వేల మంది వస్తారని అంచనా వేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి 5 వేలు, కృష్ణాజిల్లా నుంచి 10 వేలు, బాపట్ల జిల్లా నుంచి 10 వేలు, ఏలూరు జిల్లా నుంచి 5 వేల మంది తరలివస్తారని ఆయా జిల్లాల యంత్రాంగాలు అంచనా వేస్తున్నాయి.

ప్రకాశం బ్యారేజీ మీదుగా వీఐపీ రూట్

సభా ప్రాంగణానికి వెళ్లేందుకు వీఐపీ రూట్‌ను ఏర్పాటు చేశారు. ఈ వీఐపీ రూట్ విజయవాడలో ప్రకాశం బ్యారేజీ, కరకట్ట, వెంకటపాలెం, సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా ఈ - 3, ఎన్ 9 జంక్షన్ నుంచి ఎడమవైపుగా ఈ-6, ఎన్ 9 జంక్షన్‌ను టచ్ చేస్తూ సచివాలయం పక్క నుంచి నేరుగా పీ-9 పార్కింగ్ ప్లేస్‌కు వాహనాలు వెళ్తాయి. ఒకవేళ అవాంతరాలు ఏమైనా ఏర్పడితే వీఐపీ ఆల్టర్‌నేటివ్ రూట్‌ను కూడా నిర్ణయించారు. ప్రకాశం బ్యారేజీ నుంచి ఉండవల్లి జంక్షన్, ఉండవల్లి రోడ్డు మీదుగా వెంకటపాలెం వెళ్లేలా ప్లాన్ చేశారు.

జీతాలు పెరిగినాయీ

- ఆలయాల్లో నాయీ బ్రాహ్మణులకు జీతాల పెంపు
- ఏకంగా రూ.25 వేలు చేసిన ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 7 ఆలయాల్లో 45 మందికి వర్తింపు
- ఆనందం వ్యక్తం చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు ఆలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారి జీతాలను పెంచుతూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర దేవదాయశాఖ స్పెషల్ సెక్రటరీ జి.జయలక్ష్మి జీవో ఎంఎస్ నంబర్ 130 జారీ చేసింది. దీంతో పలు ఆలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులు ఆనందం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 7 ఆలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు ఇప్పటి వరకు ప్రభుత్వం నెలకు రూ.20 వేలు జీతం చెల్లిస్తుండగా.. ఇక నుండి రూ.25 వేలు ఇవ్వనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం, అమరావతి అమరలింగేశ్వర స్వామి దేవస్థానం, పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానం, తెనాలిలోని పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానం, అడిగొప్పలోని నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దేవస్థానం, మంగళగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం, కంఠమరాజు కొండూరులోని మహంకాళి అమ్మవారి దేవస్థానంలో పనిచేస్తున్న 45 మంది నాయీ బ్రాహ్మణులందరికీ పెరిగిన జీతాలు వర్తించనున్నాయి. ప్రతి ఆలయంలో ఐదు నుంచి ఏడుగురు నాయి బ్రాహ్మణులు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో వీరికి తలనీలాలు సమర్పించే భక్తులు తీసుకున్న టోకెన్‌లలో సగం డబ్బులు వచ్చేవి. ఆ తర్వాత పూర్తి డబ్బులను వారికి అప్పజెప్పారు. జీతాలు చాలడం లేదని నాయీ బ్రాహ్మణులు గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతి పత్రాలు అందజేశారు. దీంతో స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం తల నీలాల టోకెన్లతో సంబంధం లేకుండా ప్రతి ఒక్క నాయీ బ్రాహ్మణుడికి నెలకు రూ.25 వేలు చెల్లించే విధంగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయా ఆలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానం

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో నేను పనిచేస్తున్నాను. రూ.25 వేల జీతం చెల్లించడం ఆనందంగా ఉంది. గతంలో అనేక ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు ఆ ఇబ్బందులు అధిగమిస్తాం.

- మున్నంగి శివ నాగేశ్వరరావు

ప్రత్యేక ధన్యవాదాలు



పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో పనిచేస్తున్నాను. ప్రభుత్వం జీతాలు పెంచడం ద్వారా మా జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. ఈ దిశగా చర్యలు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ప్రత్యేక ధన్యవాదాలు.

- ఎం.పిచ్చయ్య

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

కంప్యూటర్, టైలరింగ్‌పై ఉచిత శిక్షణ

నరసరావుపేట కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నాక్, ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో టైలరింగ్, కంప్యూటర్ కోర్సులపై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎస్సీ సామాజికవర్గ యువతులకు నిర్వహించే ఈ శిక్షణ ఈ నెల 1 నుంచి మూడు నెలల పాటు ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న యువతులు విద్యార్హత, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో లింగగుంట్లలోని నాక్‌సెంటర్‌లో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 9394102075, 9985496190ను సంప్రదించాలన్నారు.

తెలుగు ఉపాధ్యాయురాలు పద్మకు డాక్టరేట్


డాక్టరేట్ పొందిన పద్మ

వినుకొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలు వి.పద్మకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. తెలుగు ప్రాచ్యభాషా విభాగాధిపతి ఆచార్య ఎన్వీ కృష్ణారావు పర్యవేక్షణలో సలీం కథా సాహిత్యానుశీల అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. 2005లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా చేరారు. యూజీసీ నెట్, ఏపీ సెట్ వంటి అర్హత పరీక్షల్లో విజయం సాధించి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రాచ్య భాషా విభాగంలో పరిశోధన చేపట్టారు. రెండు అంతర్జాతీయ, ఐదు జాతీయ సదస్సుల్లో పాల్గొని ఆమె పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఇప్పటి వరకు ఆమె రాసిన ఏడు పరిశోధన ప్రతాలు యూజీసీ కేర్ లిస్టెడ్ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయని తెలిపారు. వి.పద్మ డాక్టరేట్ సాధించడంపై పాఠశాల హెచ్‌ఎం కె.నాగలక్ష్మి, సహోపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

వేసవి చిత్రకళా తరగతులు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జెస్టిస్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో సీపీఎం పార్టీ జయతి హాస్పటల్ పక్కన యూటీఎఫ్ ఆఫీస్‌లో వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ చిత్రకారుడు, అకాడమీ డైరెక్టర్ వజ్రగిరి జెస్టిస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ వినుకొండ డివిజన్ వారి సహకారంతో వేసవి చిత్రకళా తరగతులు ఈ నెల 28వ తేదీ నుంచి పది రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం 7.30గంటల నుంచి ఉదయం 9గంటల వరకు విద్యార్థులకు డ్రాయింగ్, పెయింటింగ్‌లలో క్లాసులు జరుగుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9848469694 నంబరును సంప్రదించాలన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్ల కోసం దరఖాస్తు చేసుకోండి

రొంపిచర్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం ద్వారా లభించే 25శాతం ఉచిత సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని విద్యా శాఖ అధికారులు హవీల, బ్రహ్మేశ్వర రావు గురువారం కోరారు. ఈ నెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత వెబ్‌సైట్‌లో నేరుగా ఎంఈవో కార్యాలయం, సచివాలయం, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

28 నుంచి యోగా శిక్షణ శిబిరం

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): 186వ ఉచిత యోగ శిక్షణ శిబిరం ఈ నెల 28 నుంచి నిర్వహిస్తున్నామని శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం నరసరావుపేట శాఖ నిర్వాహకులు కూనిశెట్టి వెంకట జనార్దనరావు గురువారం తెలిపారు. వేసవి సెలవులు కావడంతో విద్యార్థులకు ప్రత్యేక యోగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. పట్టాభిరామస్వామి దేవాలయం వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఉదయం 5 గంటల నుంచి 28 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. అదనపు సమాచారంకోసం కన్వీనర్ కూనిశెట్టి అనూరాధ, 9490846333, 9491665733ను సంప్రదించాలన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

చిలకలూరిపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం బొప్పూడి గ్రామ శివారులో నలుగురు వ్యక్తులు గురువారం పేకాట ఆడుతుండగా చిలకలూరిపేట రూరల్ ఎస్‌ఐలు జి.అనిల్‌కుమార్, ఎస్‌కే మహబూబ్ సుభాని సిబ్బందితో కలిసి దాడి చేసి వారిని అరెస్టు చేశారు. వారివద్ద నుంచి రూ.25వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు.

వైభవంగా బొప్పూడి తిరునాళ్ల


చిలకలూరిపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పక్కన బొప్పూడి డొంక వద్ద శ్రీప్రసన్నాంజనేయ స్వామి వారి తిరునాళ్ల గురువారం వైభవంగా జరిగింది. దేవస్థానం 42వ వార్షికోత్సవాన్ని కూడా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన ప్రధాన అర్చకులు మురికిపూడి సంతోష్ చరణ్, దివి పవన్ కుమార్ ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. తిరునాళ్ల సందర్భంగా దేవస్థానం ఆవరణలో రెండు వేల మందికి అన్నదానం చేశారు. బొప్పూడి గ్రామస్థులు మొత్తం నాలుగు విద్యుత్ ప్రభలను తిరునాళ్ల వద్దకు తరలించారు.

ఐదు వార్డుల టీడీపీ కమిటీల ఎన్నిక

చిలకలూరిపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా పట్టణంలోని 8,9,18,7,19 వార్డులకు నూతన కార్యవర్గాల ఎన్నికలు జరిగాయి. 8వ వార్డుకు జి.గంగాధర్, టి.సుబ్బారావు, 9వ వార్డుకు గోపిదేశి వెంకటేశ్వర్లు, ఎం.దాసు, 18వ వార్డుకు ఎ.కోటేశ్వరరావు, కరిముల్లా, 7వ వార్డుకు షేక్ బాజీ, పూల పాపారావు, 19వ వార్డుకు అబ్దుల్లా, వై. యేసుబాబులు ఎన్నికయ్యారు.

విద్యా వ్యవస్థలో సంస్కరణలకు నిదర్శనం పది ఫలితాలు

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి గడిచిన పది నెలల్లో విద్యావ్యవస్థలో చేపట్టిన సంస్కరణల ప్రతిఫలమే పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు వచ్చాయని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గురువారం జీవీ ఆంజనేయులు అభినందనలు తెలిపారు. 591మార్కులు సాధించిన వినుకొండ జడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు జె.ఖతిజ, విప్పర్ల చాతుర్య, చీకటీగల పాలెం ఆదర్శ పాఠశాల విద్యార్థి టి.సాయిరాంకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జీవీ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థులు ఈసారి అనేక మంది కార్పొరేట్ విద్యార్థులకు ధీటుగా కఠోరశ్రమ అంకితభావంతో అత్యధిక మార్కులతో సర్కారు విద్యావ్యవస్థ బలాన్ని చాటిచెప్పారన్నారు. వీరంతా రాష్ట్రంలోని ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా అద్భుతమైన ఫలితాలు సాధించడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ఈపూరు మండలం కొండ్రముట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించినందుకు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందిని, విద్యార్థులను ఆయన ప్రశంసలు తెలియజేశారు. పల్నాడు జిల్లా గతేడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 18వ స్థానంలో నిలిచినప్పటికీ ఈ ఏడాది 11వ స్థానానికి ఎగబాకడం గర్వకారణమన్నారు. ఈ పురోగతి జిల్లా విద్యావ్యవస్థలో జరుగుతున్న సానుకూల మార్పులకు నిదర్శనంగా పేర్కొన్నారు. ప్రభుత్వ సంకల్పంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారుల కృషి ఫలితంగా ఇది సాధ్యమైందన్నారు.

బీసీ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


సాతులూరులో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పుల్లారావు

నాదెండ్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బీసీ మహిళల ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని సాతులూరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో వెనుకబడిన కులాల ఆర్థిక సహకార సంస్థ, ఈడబ్ల్యూఎస్ వారి ఆధ్వర్యంలో బీసీ మహిళల కోసం ఏర్పాటుచేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని గురువారం పుల్లారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుట్టు పనిలో మంచి మెళకవలు సాధించి తమ కుటుంబాలను పోషించుకోవటంతో పాటు మరో నలుగురికి ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఈ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం పలు ఉపాధి కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, వాటిని సద్వినియోగం చేసుకొని మహిళలు అభివృద్ధి చెందాలన్నారు. శిక్షణ పొందిన వారికి ప్రభుత్వం ఉచితంగా కుట్టు మిషన్‌లను అందజేస్తుందని వివరించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ పనితీరును పవన్ కల్యాణ్ మెరుగుపరిచారని కొనియాడారు. గ్రామాల రూపురేఖలు మార్చేందుకు ఆయన శ్రమిస్తున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ స్వరూపరాణి, సర్పంచ్ ఎం.శోభారాణి, పార్టీ నాయకులు ఎస్.సదాశివరావు, బీ సత్యనారాయణ, కే శ్రీనివాసరావు, పీ అప్పారావు, వీ హిమవంతరావు, నాగపూర్ణచంద్రరరావు, సీహెచ్ అనీల్, అనితాబాయి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్, గాంధీ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం


యడ్లపాడులో పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

యడ్లపాడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభలను నిర్వహించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటాలకు నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. యడ్లపాడు పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన గ్రామసభలో ఎంపీడీవో హేమలతాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీలకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించబడిందన్నారు. అధికార వికేంద్రీకరణ, సామాజిక న్యాయం, ఆర్థిక సాధికారతలు సాధించడం స్థానిక సంస్థల ప్రధాన లక్ష్యం అన్నారు. స్థానిక సమస్యలను ప్రజలు గ్రామసభల ద్వారా చర్చించుకుని గ్రామాభివృద్ధికి దోహదపడేలా ప్రణాళికలు రూపొందించుకుని సుస్థిర లక్ష్యాల సాధన దిశగా కృషిచేయాలన్నారు. స్థానిక సంస్థలు మరింత బలోపేతంగా ఉండాలంటే ప్రజల భాగస్వామ్యం, సహకారం ఉండాలన్నారు. అనంతరం పంచాయతీ పారిశుధ్య సిబ్బందిని అధికారులు, ప్రజాప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శశికళ, సర్పంచ్ కె హేమలత, ఎంపీటీసీ అరుణ్, ఉపసర్పంచ్ జి.హరిబాబు, నీటి సంఘం అధ్యక్షుడు రాఘవయ్య, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో నరసరావుపేట పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డివిజన్ పీఆర్‌ఐ ఈఈ వైసీ సుబ్బారాయుడు, మేనేజర్ సీహెచ్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఈఈ కే ముత్తయ్య, ఏఈ పీ వెంకటేశ్వర్లు, ఏఈఈ కే హరినాథ్, ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సభలు నిర్వహించి ఆయా గ్రామాల్లో పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను తెలియజేశారు. ఉపాధిహామీ పథకం ద్వారా వేల మందికి పని కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. మౌలిక వసతులు, అభివృద్ధి, పంచాయతీరాజ్ చట్టంతోనే సాధ్యమవుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

● వినుకొండ: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరవి పాల్గొని మాట్లాడుతూ గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు, స్వచ్ఛ భారత్ మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శులు సుబ్బారెడ్డి, ఎలీషా, వెంకటకృష్ణ, శ్రీనివాసరావు, శ్రీధర్, గౌస్, మన్సూర్, విజయలక్ష్మి, మూర్తిరెడ్డి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

● నూజెండ్ల: మండల కేంద్రం నూజెండ్లలో జాతీయ పంచాయతీ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి స్థానిక ప్రభుత్వాల ప్రాధాన్యతను అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వీర్ల వెంకటస్వామి, ఈవోపీఆర్‌డీ ఎస్‌కే రఫానీ, ఏపీవో ఆంజనేయ రాజు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్ సభ్యులు


కుటుంబసమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

చిరకాల స్వప్నం పోలవరం-బనకచర్ల అనుసంధానం

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల పూర్తి చిరకాల స్వప్నమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. ఆ దిశగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు తిరుమల వెంకటేశ్వరస్వామి శక్తిసామర్థ్యాలు, అవకాశాలు ఇవ్వాలని ప్రార్థించినట్లు తెలిపారు. గురువారం జీవీ కుటుంబసమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీఐపీ విరామ దర్శన సమయంలో ఆయన కుటుంబసభ్యులతో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. తితిదే అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వారికి ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. జీవీ సతీమణి శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ లీలావతి, శివశక్తి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ హరీష్ దంపతులు శ్రీవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

మత సామరస్యానికి ప్రతీక భారతదేశం

గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి


ప్రహరీని ప్రారంభిస్తున్న నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీక భారతదేశం నిలుస్తుందని గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి అన్నారు. మండలంలోని చిరుమామిళ్ళ గ్రామంలో సుమారు రూ.7 లక్షల సొంత నిధులతో నిర్మించిన ప్రహరీ గోడకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఎన్ని మతాలు ఉన్నప్పటికీ అన్ని మతాలను ప్రజలు గౌరవిస్తారన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించు కోవటం ద్వారా మానవుని జీవితానికి శాంతి, సమాధానం లభిస్తుందన్నారు. గ్రామాభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని ఆయన వివరించారు. ఈ సందర్భంగా రామిరెడ్డిని సెవెన్త్ డే ఎడ్వెంటరీ చర్చి సభ్యులు, గ్రామస్తులు ఊరేగింపుగా చర్చి వద్దకు తీసుకు వెళ్ళారు. ప్రత్యేక ప్రార్థనల మధ్య ఆయన ప్రహరీని ప్రారంభించారు.

ఉగ్రవాదులను శిక్షించాలి: మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ, ఏప్రిల్ 24, (ఆంధ్రజ్యోతి) జమ్ము కాశ్మీర్‌లోని బైసారన్ వద్ద పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో 28 మంది మృతిచెందిన సంఘటనకు నిరసనగా జనసేన పార్టీ నియోజకవర్గం సమన్వయకర్త కొంజేటి నాగశ్రీను రాయల్ ఆధ్వర్యంలో శివయ్య స్థూపం సెంటర్‌లో గురువారం నిరసన దీక్ష చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని మాట్లాడుతూ ఉగ్రవాదులను పట్టుకుని శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాల్పుల్లో మన రాష్ట్రానికి చెందిన యాత్రికుడు మధుసూదన్ జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది నలబోతు రామకోటేశ్వరరావు, నక్క రమణారావు, ధర్మం కోటేశ్వరరావు, ముంద్రు చంద్రమోహన్, మీసాల శ్రీనివాసరావు, యలవర్తి శ్రీనివాసరావు, కేఎస్‌ఎం నాయుడు, శివశంకర్, శ్రీనివాసరావు, హనుమంతరావు, విశ్వహిందూ పరిషత్ నాయకులు భాగవతుల రవికుమార్, గజవల్లి పవన్, గంధం కోటేశ్వరరావు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆయుబ్‌ఖాన్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని మృతులకు నివాళులర్పించారు.

● నరసరావుపేట టౌన్: పహల్గామ్ ఉగ్రవాద దాడులలో ప్రాణాలు కోల్పోయిన వారికి జనసేన కార్యాలయంలో గురువారం సంతాపం తెలియజేశారు. జనసేన పార్టీ నిర్వహించే సంతాప దినాలలో భాగంగా ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా మౌన దీక్ష నిరసన కార్యక్రమం నిర్వహించారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ ఆధ్వర్యంలో ఈ మౌన నిరసన దీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జీవీఎస్ ప్రసాద్, రొంపిచర్ల మండల అధ్యక్షుడు అచ్చుల సాంబశివరావు, జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: సీపీఐ ఆధ్వర్యంలో కశ్మీరులో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లో గురువారం సీపీఐ ఆధ్వర్యంలో ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులతో కలిసి కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభానిలతో పాటు టీడీపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, లోక్‌సత్తా, జనక్రాంతి పార్టీ, ముస్లిం జేఏసీ నాయకులు ఎం.రాధాకృష్ణ, సమద్‌ఖాన్, అజారుద్దీన్, మల్లిబాబు, పి.వెంకటేశ్వర్లు, మౌలాలి, అల్లాబక్షు, జబ్బార్, షేక్ జరినా సుల్తానా, మిరియాల రత్నకుమారి, చెరుకుపల్లి నిర్మల, మాదాసు భానుప్రసాద్, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

● కశ్మీరులో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ పట్టణంలోని నరసరావుపేట సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం దగ్గర నుంచి పలు ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. కార్యక్రమంలో బి.శ్రీను నాయక్, కొండ్రముట్ల నాగేశ్వరరావు, తుర్లపాటి వెంకట నగేష్, నలికినీడి నాగరాజు, తాడిబోయిన వీరేంద్రనాథ్, చెన్నకేశవుల రాంబాబు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకుంటాం : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుభానినగర్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. ప్రమాదంలో రూ.10లక్షల ఆస్తినష్టం జరిగిందని ప్రత్తిపాటికి బాధితులు తెలిపారు. బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామని ప్రత్తిపాటి వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ప్రత్తిపాటి వెంట టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్ మోహన్, గట్టినేని రమేష్, కరిముల్లా, కాలేషా పాల్గొన్నారు.


గాంధీ పార్కు వద్ద ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

● భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం డిమాండ్

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, గతంలో మంజూరుచేసి పెండింగ్‌లో ఉంచిన క్లైయిమ్‌లకు వెంటనే నిధులు చెల్లించాలని పల్నాడు భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని గాంధీ పార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అవ్వారు ప్రసాదరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న భవన నిర్మాణ కార్మికులకు నష్టదాయకమైన లేబర్‌కోడ్లను రద్దు చేయాలన్నారు. కార్మికుల సంక్షేమ పథకాల అమలు కోసం ఉద్దేశించి వసూలు చేసిన సెస్ నిధులను కార్మికుల సంక్షేమానికి మాత్రమే ఖర్చు చేయాలన్నారు. వివిధ సందర్భాలలో గత ప్రభుత్వాలు అక్రమంగా తీసుకున్న వెల్ఫేర్ బోర్డు నిధులను తక్షణమే తిరిగి చెల్లించాలని, అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు గృహ నిర్మాణాలకు వెల్ఫేర్ బోర్డు ద్వారా సబ్సిడీతో కూడిన లోన్లు ఇవ్వాలన్నారు. ఇతర రాష్ట్రాలలో అమలౌతున్నట్లుగా భవన నిర్మాణ కార్మికులకు మెరుగైన సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని, కార్మికులు పనికోసం వేచిఉండే అడ్డాలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, నిర్మాణాలలో ఉపయోగించే వస్తువులపై జీఎస్టీ తగ్గించాలని కోరారు. ధర్నాలో సంఘం ప్రధాన కార్యదర్శి సిలార్ మసూద్, సురేష్, కోట ఆంజనేయులు, చిలక చిన్న ఏసయ్య, ఎస్.వెంకటేశ్వరరాజు, రామిశెట్టి ఆంజనేయులు, సైదులు, బాల కోటయ్య, పీ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని యువకుడు మృతి


ఇంటూరి మణికంఠ (ఫైల్ ఫొటో)

వినుకొండ టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొని యువకుడు మృతిచెందిన సంఘటన పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని రిలయన్స్ పెట్రోల్ బంకువద్ద గురువారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వినుకొండలోని పొగాకు కంపెనీలో పనిచేస్తున్న ఇంటూరి మణికంఠ (27) నరసరావుపేట వైపు వస్తుండగా, ప్రకాశం జిల్లా, మరియామల గ్రామానికి చెందిన కొమ్ము వెంకయ్య, వెంకట లింగంలు ద్విచక్రవాహనంపై శావుల్యాపురం మండలం పోట్లూరు తిరుణాలకు వెళ్లి వినుకొండకు వస్తుండగా రిలయన్స్ పెట్రోల్ బంకువద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్నాయి. ప్రమాదంలో మణికంఠ అక్కడికక్కడే మృతిచెందగా, మరో వాహనంపై ఉన్న వెంకయ్య, లింగంలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు అవివాహితుడు. ఇంటికి ఆధారమైన కుమారుడు మృతి చెందటంపై తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కత్తి స్వర్ణలత తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం ఢీకొని కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలైన సంఘటన ఏనుగుపాలెం రోడ్డులోని రైస్ మిల్‌వద్ద గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మందమంచిపాడు వద్ద జరుగుతున్న ఎడ్ల బల ప్రదర్శన పోటీల వద్ద బందోబస్తు కోసం కానిస్టేబుల్ వెంకట్రావు ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న అలవూలపాడుకు చెందిన ముత్తినేని ఏడుకొండలు వాహనం ఢీకొంది. దీంతో కానిస్టేబుల్‌కు కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన కానిస్టేబుల్‌ను స్థానికులు ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్లకు దుండగుల నిప్పు

ఈపూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): చెట్లకు నిప్పు పెట్టడం.. కాలిన తరువాత అక్కడ నుంచి తరలించడం.. ఆ ప్రదేశాన్ని ఆక్రమించి భవనాలు నిర్మించి అద్దెలకు ఇవ్వడం.. గత కొంతకాలంగా ఈపూరులో జరుగుతున్న వ్యవహారం. బుధవారం రాత్రి ఈపూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న వందల ఏళ్ళనాటి చింతచెట్టుకు కొందరు దుండగులు నిప్పుపెట్టారు. మండల కేంద్రమైన ఈపూరులో పోలీస్ స్టేషన్ దగ్గర నుంచి వ్యవసాయ మార్కెట్ వరకు సుమారు కి.మీ వరకు ఆర్ అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా వందల సంవత్సరాల వయస్సు కలిగిన చింత చెట్లు ఉన్నాయి. కొందరు దుండగులు ఆ చెట్లకు నిప్పుపెడుతున్నారు. ఆ తరువాత ఆ స్థలాన్ని ఆక్రమించి మట్టితో చదును చేసి అక్కడ శాశ్వత భవన నిర్మాణాలు చేసి అద్దెలకు ఇస్తున్నారు. ప్రస్తుతం ముప్పాళ్ళ అడ్డరోడ్డు దగ్గర నుంచి మండల ప్రజాపరిషత్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు జరుగుతూనే ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పరీక్ష కేంద్రాలలో వసతులు కల్పించండి: డీఆర్వో

నరసరావుపేట కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న జరిగే ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఉమ్మడి ప్రవేశ పరీక్ష జరిగే అన్ని కేంద్రాలలో అభ్యర్థులకు అన్ని వసతులు కల్పించాలని డీఆర్వో ఏకా మురళి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన పరీక్షల నిర్వహణపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5,6,7,8 తరగతులకు, ఇంటర్, డిగ్రీ ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 7 కేంద్రాలలో 2650 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, 2.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగే పరీక్షకు అన్ని కేంద్రాలలో తాగునీరు, విద్యుత్తు, వైద్య సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో ఆర్డీవో మధులత, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్, చంద్రకళ, డీసీవో ఎన్.సరోజిని, ప్రభుత్వ పరీక్షల నిర్వహణాధికారి ఎ.ఎం.ఎ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు డీఎస్సీపై అవగాహన సదస్సు

చిలకలూరిపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖ గ్రంథాలయంలో శనివారం సాయంత్రం ఐదు గంటలకు ఉచిత డీఎస్సీ అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్ వ్యవస్థాపకులు షేక్ జాఫర్ గురువారం తెలిపారు. నిరుద్యోగ అభ్యర్థులు, ప్రైవేటు ఉపాధ్యాయ, అధ్యాపకులు సదస్సుకు హాజరై సందేహాలు నివృత్తి చేసుకోవాలని కోరారు.

సివిల్స్ విజేతకు మాజీ ఎమ్మెల్యే అభినందనలు

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రకటించిన సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో 591వ ర్యాంక్ సాధించిన పట్టణానికి చెందిన యామినిని గురువారం ఆమె గృహంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అభినందించారు. విద్యార్థులకు యామిని విజయం స్ఫూర్తి దాయకం అన్నారు.